


# అనంత జనశక్తి

జనం కోసమే మా అక్షరం

25.08.2026

మంగళవారం| రంగారెడ్డి

సంపుటి : 01 | సంచిక: 56

పేజీలు : 08 | వెల: రూ.5

AJS అనంత జనశక్తి జనం కోసమే మా అక్షరం

PUBLISHED BY ANANTAPUR, KADAPA, CHITTOR, VISAKHAPATNAM, SRIKAKULAM, EALLURU, TIRUPATHI, ONGOLE, VIJAYAWADA, NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL.


## దేశాభివృద్ధి ఎలా సాధ్యం?

- పాఠశాలల్లో ప్రాథమిక సౌకర్యాల్లేవు
- సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే
- ప్రజా విద్యను ప్రాధాన్యతగా తీసుకోవాలి
- కేంద్ర విద్యా శాఖ మంత్రికి లేఖ

**న్యూఢిల్లీ, ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్**

ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి దారుణంగా ఉందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కన్వీనర్ అభిజీత్ దీప్కే ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రాథమిక సౌకర్యాలు లేవన్నారు. ఈ నేపథ్యంలో దేశాభివృద్ధి ఎలా సాధ్యమవుతుంది? అని ఆయన సందేహం వ్యక్తం చేశారు. ప్రజా విద్యను ప్రాధాన్యతగా తీసుకొని పాఠశాలలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సోమవారం కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి సీజేపీ కన్వీనర్ అభిజీత్ దీప్కే లేఖ రాశారు.



2లో..

## మిస్ యూనివర్స్ ఇండియా 2026 విజేతగా కేరళ కుట్టి కాజియా లిజ్ మెజో

### జైపూర్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలే

### 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి..

**జైపూర్, ఆగస్టు 24, అనంతజనశక్తి న్యూస్**

కేరళకు చెందిన 19 ఏళ్ల లా విద్యార్థిని, మోడల్ కాజియా లిజ్ మెజో 'మిస్ యూనివర్స్ ఇండియా 2026' కిరీటాన్ని సొంతం చేసుకున్నారు. జైపూర్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులను వెనక్కి నెట్టి ఆమె విజేతగా నిలిచారు. దీంతో నవంబర్‌లో పోర్టో రికోలో జరగనున్న 75వ మిస్ యూనివర్స్ పోటీల్లో భారత్ తరపున ఆమె బరిలోకి దిగనున్నారు.

2లో..



## బంగ్లాదేశ్‌లో హిందూ కుటుంబం హత్య



2లో..

# తెలంగాణ రైజింగ్ ఆపలేరు

- కేంద్రం నిర్ణయంపై సీఎం తీవ్ర ఆగ్రహం
- తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శ
- పెట్టుబడుల కోసమే అమెరికా పర్యటన: రేవంత్
- లండన్‌కు ఓకే.. అమెరికాకు ఎందుకు నో?: సీఎం
- గుజరాత్ సీఎంకు అనుమతి.. తనకు ఎందుకు?: రేవంత్
- మోదీపై సీఎం తీవ్ర విమర్శలు
- పార్లమెంట్‌లో అంశాన్ని లేవనెత్తుతామన్న సీఎం



**హైదరాబాద్, ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్**

**తెలంగాణ అభివృద్ధి, విదేశీ పెట్టుబడులే లక్ష్యంగా తాను తలపెట్టిన విదేశీ పర్యటనకు కేంద్ర ప్రభుత్వం అనుమతి నిరాకరించడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వికసిత్ భారత్‌లో భాగస్వామ్యమవుతూ తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటే, కేంద్రం రాజకీయ కోణంలో ఆలోచించి నిర్ణయం తీసుకుందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రానికి జరిగిన ఈ అన్యాయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.**

విదేశీ పర్యటన ఉద్దేశం.. విద్య, పెట్టుబడులే మా లక్ష్యం రాష్ట్రాల కలయికతోనే కేంద్రం ఏర్పడుతుందనే విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీఎం రేవంత్ అన్నారు. తెలంగాణ రైజింగ్ పాలసీలో భాగంగా రాష్ట్రంలో విద్య, క్రీడలు, పారిశ్రామిక రంగానికి పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. గాంధీ, అంబేద్కర్ లాంటి మహనీయులు చదువుకున్న ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాలను తెలంగాణకు తీసుకురావాలని భావించామని, ఇక్కడే ఆ స్థాయి క్యాంపస్‌లు వస్తే వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని వివరించారు.

**లండన్‌కు ఓకే.. అమెరికాకు నో ఎందుకు?**

తన విదేశీ పర్యటనకు సంబంధించి కేంద్రానికి సమర్పించిన దరఖాస్తులో అన్ని వివరాలు పక్కాగా పొందుపరిచామని, పర్యటన ఉద్దేశాన్ని (పర్పస్) స్పష్టంగా వివరించామని సీఎం తెలిపారు. దరఖాస్తులో అసంపూర్ణ వివరాలు ఉన్నాయంటూ బీజేపీ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. లండన్, అమెరికా పర్యటనలకు ఒకే రకమైన ప్రతిపాదనలు సమర్పిస్తే.. ఇంగ్లాండ్ పర్యటనకు అనుమతినిచ్చి, అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పర్యటనలో విషయంలో లేకపోతే ఇంగ్లాండ్‌కు ఎలా అనుమతించారని ప్రశ్నించారు.

**పర్యటనపై బీజేపీ రాజకీయాలు.. మోదీ గుజరాత్‌కే ప్రధానా?**

కేంద్రం తీసుకున్న ఈ రాజకీయ నిర్ణయం తెలంగాణ ముఖ్యమంత్రిని తిరస్కరించడం కాదని, ఇది తెలంగాణ ప్రజలను తీవ్రంగా అవమానించడమేనని రేవంత్ ధ్వజమెత్తారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రధానిగా కాకుండా కేవలం 'గుజరాతీ'గా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గుజరాత్ ముఖ్యమంత్రి వైబ్రెంట్ గుజరాత్ రోడ్ షోల కోసం అమెరికా, కెనడాల్లో పర్యటించేందుకు అనుమతి ఇచ్చిన కేంద్రం, తెలంగాణ అభివృద్ధి కోసం తాను వెళ్తానంటే ఎందుకు అడ్డుకుందో చెప్పాలన్నారు.

2లో..

## ఢిల్లీని ముంచెత్తిన వాన జనజీవనం అస్తవ్యస్తం

- విమానాలు దారి మళ్లింపు
- 262 విమాన సర్వీసులపై ప్రభావం
- ప్రధాన రహదారులన్నీ జలమయం


**న్యూఢిల్లీ, ఆగస్టు 24, అనంతజనశక్తి న్యూస్**

ఉత్తర భారత్‌లో రుతుపవనాలు తీవ్ర రూపం దాల్చడంతో ఢిల్లీఎన్‌సీఆర్ సహా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు, ఈదురు గాలులు విరుచుకుపడ్డాయి. నోయిడా, ఘజియాబాద్, గుర్గావ్, ఫరీదాబాద్ ప్రాంతాలను ముంచెత్తిన వానల వల్ల జనజీవనం స్తంభించడమే కాకుండా రవాణా వ్యవస్థకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ప్రతికూల వాతావరణం కారణంగా ఢిల్లీ ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి రావాల్సిన 15 విమానాల రూట్లను అధికారులు దారి మళ్లించారు.

2లో..

## మతం మారాలని సాధిక్ ఒత్తిడి చేశాడు

- సౌజన్య తీవ్రంగా వ్యతిరేకించింది
- కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్



2లో..

## యువతకు హామీ నెరవేరుస్తున్నాం

- జాబ్ క్యాలెండర్‌పై పవన్ కళ్యాణ్!
- ప్రతిభే కొలమానంగా పోస్టులు భర్తీ చేస్తాం
- జాబ్‌ల భర్తీ అవినీతికి ఆస్కారం లేదు
- అర్హులైన వారికే ఉద్యోగాలు వస్తాయి

2లో..



**అమరావతి, ఆగస్టు 24, అనంతజనశక్తి న్యూస్**

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో యువతకు ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో ప్రతిభే ప్రధాన కొలమానంగా ఉంటుందని స్పష్టం చేశారు.

## 'ఫీజు బకాయిబీజేపీ లడాయి'

- బీజేపీ పోరాటం కొనసాగుతోంది
- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల అంశం
- రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- 5 లక్షల మంది విద్యార్థుల సంతకాలు సేకరించాం

2లో..

**హైదరాబాద్, ఆగస్టు 24, అనంతజనశక్తి న్యూస్**

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బీజేపీ పోరాటం కొనసాగుతోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేవైఎం ఆధ్వర్యంలో కాలేజీలకు వెళ్లి 5 లక్షల మంది విద్యార్థుల నుంచి సంతకాలు సేకరించామని తెలిపారు. "మా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు మాకివ్వండి" అంటూ విద్యార్థులు స్వయంగా సంతకాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని తెలిపారు. 'ఫీజు బకాయిబీజేపీ లడాయి' పేరుతో బీజేపీ దీక్ష చేపట్టిన సందర్భంగా సోమవారం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు.

## షేర్ చేస్తే చర్యలు తప్పవు ఆ ఎన్నికల షెడ్యూల్ అబద్ధం

- ఎన్నికల కమిషనర్ వార్నింగ్
- ఇది పూర్తిగా దుష్ప్రచారమని వెల్లడి
- అనిల్ చంద్ర పునేఠా క్లారిటీ

2లో..

**అమరావతి, ఆగస్టు 24, అనంతజనశక్తి న్యూస్**

ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ఇదేనంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై ఏపీ ఎన్నికల సంఘం స్పందించింది. స్థానిక ఎన్నికల షెడ్యూల్ పేరుతో దుష్ప్రచారం జరుగుతోందని కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా స్పష్టం చేశారు.

## జాబ్ నోటిఫికేషన్లు ఏవి?

- లిక్కర్ నోటిఫికేషన్లు ఇస్తున్నారు
- మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం
- 121 మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్‌పై ఫైర్
- యువత ఉద్యోగాల కోసం చూస్తున్నారు



**హైదరాబాద్, ఆగస్టు 24, అనంతజనశక్తి న్యూస్**

**తెలంగాణ ప్రభుత్వం కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్ ఇవ్వడంపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్రంగా స్పందించారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు ఇవ్వకుండా.. మద్యం బ్రాండ్లకు మాత్రం నోటిఫికేషన్లు జారీ చేస్తున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు మాత్రం ఫుల్' అంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. యువత భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై దృష్టి పెట్టకుండా మద్యం వ్యాపారంపై ఎందుకు అంత ఆసక్తి చూపుతోందని ప్రశ్నించారు.**

రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం లిక్కర్ అమ్మకాలపైనే ఎక్కువ శ్రద్ధ చూపుతోందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రభుత్వ తీరుపై విమర్శలు చేశారు.

**121 కొత్త మద్యం బ్రాండ్లకు నోటిఫికేషన్**

తెలంగాణలో కొత్తగా 121 రకాల మద్యం బ్రాండ్లు అందుబాటులోకి రానున్నట్లు ఆదివారం ప్రకటన వెలువడింది. సుమారు 18 కంపెనీలకు చెందిన మద్యం సరఫరాదారులు ఈ బ్రాండ్లను రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు ఎక్సైజ్ శాఖ తెలిపింది.

# దేశాభివృద్ధి ఎలా సాధ్యం?

(మొదటి పేజీ తరువాయి)



ఈ సమస్యను పరిష్కరించే ముందు ప్రస్తుతం ఉన్న పరిస్థితులపై సమాచారం అందుబాటులో ఉంచాలని కేంద్రాన్ని ఆయన కోరారు. అందుకు సంబంధించిన వివరాలను విద్య శాఖ బహిరంగ పర్చాలని విజ్ఞప్తి చేశారు. గత ఐదేళ్లలో ఎన్ని ప్రభుత్వ పాఠశాలలు పునరుద్ధరించబడ్డాయని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం ఎన్నింటికి మరమ్మతులు లేదా పూర్తి పునర్నిర్మాణం అవసరం ఉందో వివరించాలని ఆ లేఖలో స్పష్టం చేశారు.

అలాగే ప్రస్తుతం ఎన్ని ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేశారు. వాటిలో ఎన్ని భర్తీ అయ్యాయి? ఇంకా ఎన్ని ఖాళీగా ఉన్నాయో వెల్లడించాలని కోరారు. గత ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలకు ఎన్ని నిధులు కేటాయించారు? అందులో ఎంత ఖర్చు చేశారు? కూడా తెలపాలని అన్నారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఇంకా ఎన్ని అదనపు ప్రభుత్వ పాఠశాలలు అవసరం? అవుతాయో కూడా చెప్పాలని కేంద్ర విద్యా శాఖ మంత్రిని కోరారు. బోధనతో పాటు ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు ఇంకా ఇతర ఏఏ విధులు, బాధ్యతలు అప్పగించారో కూడా చెప్పాలని కేంద్రాన్ని అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్ని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్లు, డిజిటల్ లెర్నింగ్ సౌకర్యాలు, శుభ్రంగా పని చేసే టాయిలెట్లు, సరైన క్రీడా సౌకర్యాలతోపాటు పరికరాలు ఉన్నాయో కూడా వివరించాలని కేంద్ర మంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. అయితే ఈ లేఖ తాను రాజకీయం కోసం కాదని.. ఇది విద్యార్థుల భవిష్యత్తు గురించి రాసిన లేఖ అంటూ కేంద్ర విద్యా మంత్రి ప్రహ్లాద్ జోషికి అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు.

# యువతకు హామీ నెరవేరుస్తున్నాం

(మొదటి పేజీ తరువాయి)



యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, ప్రభుత్వ వ్యవస్థలను మరింత బలోపేతం చేయడమే జాబ్ క్యాలెండర్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు జాబ్ క్యాలెండర్ ఒక నమ్మకాన్ని కల్పిస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను గుర్తించి, వాటి భర్తీ ప్రక్రియను ముందస్తు ప్రణాళికతో కొనసాగించడం ద్వారా ఉద్యోగార్థులకు స్పష్టత కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు.

గతంలో ఉద్యోగ నియామకాల కోసం ఎదురుచూసే అభ్యర్థులకు పరీక్షలు, నోటిఫికేషన్లపై స్పష్టత లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురయ్యేవని అన్నారు. ఇకపై ఉద్యోగ నియామకాల ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ ద్వారా వివిధ ప్రభుత్వ శాఖల్లో అవసరమైన పోస్టుల భర్తీకి సంబంధించి ముందుగానే సమాచారం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే లక్ష్యంతో సంవత్సరాలుగా కష్టపడుతున్న యువతకు ఈ జాబ్ క్యాలెండర్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పవన్ కల్యాణ్ అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు ముందస్తు ప్రణాళికతో తమ సన్నద్ధతను కొనసాగించేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు.

యువతలో నైపుణ్యాలను పెంచడంతో పాటు, వారికి ఉపాధి అవకాశాలను విస్తరించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. ప్రభుత్వ శాఖల్లో సిబ్బంది కొరతను

అధిగమించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. జాబ్ క్యాలెండర్‌లోని పోస్టులను ప్రతిభ ఆధారంగా, పారదర్శక విధానంలో భర్తీ చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఉద్యోగార్థులందరికీ ముందస్తుగానే హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి చదివి, పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాలని యువతకు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

**అంతర్జాతీయ వేదికపై ఏపీ సత్తా.. పవన్ కల్యాణ్ హర్షం**

విశాఖపట్నం అంతర్జాతీయ వేదికపై తన ప్రత్యేకతను చాటుకుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. విశాఖలో బ్రిక్స్ యువజన, క్రీడా మంత్రుల సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించడం ఆంధ్రప్రదేశ్‌తో పాటు దేశానికే గర్వకారణమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ ప్రపంచ దేశాలతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటూ, యువతకు నైపుణ్యాలు, ఆవిష్కరణలు,

ఔత్సాహికత, క్రీడల రంగాల్లో కొత్త అవకాశాలను కల్పిస్తోందని పవన్ కల్యాణ్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ ప్రధాన అంతర్జాతీయ కార్యక్రమాలకు వేదికగా ఎదుగుతోందన్నారు. విశాఖలో జరిగిన బ్రిక్స్ సమావేశం ద్వారా యువజన అభివృద్ధి, క్రీడా సాంకేతికత, మౌలిక వసతులు, స్పోర్ట్స్ టూరిజం రంగాల్లో అంతర్జాతీయ సహకారం మరింత బలోపేతం కానుందని పేర్కొన్నారు.

**ప్రపంచస్థాయి యువతకు దిశానిర్దేశం.....**

నైపుణ్యం, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకతతో ప్రపంచ స్థాయిలో పోటీపడే యువతను తీర్చిదిద్దాలన్న భారత దేశ లక్ష్యానికి ఆంధ్రప్రదేశ్ బలమైన భాగస్వామిగా నిలుస్తోందని పవన్ కల్యాణ్ అన్నారు. విశాఖపట్నం నుంచి ప్రపంచ వేదిక వరకు ఆంధ్రప్రదేశ్ తన సామర్థ్యాన్ని చాటుకుంటోందని పేర్కొన్నారు.

**యువకుల గల్లంతుపై పవన్ కల్యాణ్ ఆందోళన**

కాకినాడలోని గుర్రాల బీచ్ వద్ద అలల ఉధృతి కారణంగా ఇద్దరు యువకుల గల్లంతుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆందోళన వ్యక్తం చేశారు. యువకుల గల్లంతుపై సోషల్ మీడియా ఎక్స్ వేదికగా పవన్ స్పందించారు. ఈ ఘటనకు సంబంధించి జిల్లా ఎస్పీ నుంచి వివరాలు తెలుసుకున్నారు. గల్లంతైన యువకుల ఆచూకీ కోసం చేపడుతున్న గాలింపు చర్యలను మరింత ముమ్మరం చేయాలని ఆదేశించారు. గజ ఈతగాళ్లు, ప్రత్యేక రెస్క్యూ బృందాలు, మెరైన్ పోలీసు, కోస్టు గార్డుతో పాటు స్థానిక మత్స్యకార సమూహాల సహకారాన్ని కూడా తీసుకోవాలని సూచించారు. వారి కుటుంబాలకు అందుబాటులో ఉంటూ, ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని స్థానిక శాసనసభ్యులు పంతం నానాజీకి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

ఆదివారం) నలుగురు స్నేహితులు వీరబాబు, శ్రీగణేష్ సాయిరాం, యువ కిశోర్, ఆదిత్య వెంకట సందీప్‌కుమార్ కలిసి కాకినాడాలోని గుర్రాల బీచ్‌కు వెళ్లారు. ఎవరూ లేని ప్రదేశంలో నలుగురు కలిసి సముద్రంలో స్నానానికి వెళ్లగా అలల ఉధృతికి యువ కిశోర్, వీరబాబు గల్లంతయ్యారు.

మరో ఇద్దరు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం వీరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. గల్లంతైన ఇద్దరికి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

# మిస్ యూనివర్స్ ఇండియా 2026 విజేతగా కేరళ కుట్టి కాజియా లిజ్ మెజో



(మొదటి పేజీ తరువాయి)

కాజియా స్వస్థలం కేరళ అయినప్పటికీ ఆమె బాల్యం ఎక్కువగా యూఏఈలోని అబుదాబిలో గడిచింది. ఎమిరేట్స్ నేషనల్ స్కూల్, సెయింట్ జోసెఫ్ స్కూల్, అబుదాబి ఇండియన్ స్కూల్‌లో ఆమె విద్యాభ్యాసం సాగింది. పేజెంట్రీతో పాటు కాజియాకు కళలపై కూడా ఆసక్తి ఉంది. 12 ఏళ్ల పాటు శాస్త్రీయ నృత్యంలో శిక్షణ పొందారు. గాయని, సంగీత కళాకారిణిగా కూడా తన ప్రతిభను చాటుకున్నారు. డ్రమ్స్, వయోలిన్ వాయించగలరు. పబ్లిక్ స్పీకింగ్, నటనలోనూ అనుభవం ఉంది. మలయాళ చిత్రం 'షైలాక్' ద్వారా నటిగా కూడా అరంగేట్రం చేశారు. కేరళకు చెందిన కాజియా ప్రస్తుతం లా చదువుతూనే మోడలింగ్‌లో రాణిస్తున్నారు. చిన్న వయసులోనే అందాల పోటీల్లో తన సత్తా చాటుతున్నారు. 17 ఏళ్ల వయసులో మిస్ టీన్ దివా 2024 టైటిల్‌ను గెలుచుకున్నారు. అనంతరం 2025 మిస్ టీన్ ఇంటర్నేషనల్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించి ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు. ఈ ఏడాది జరిగిన మిస్ యూనివర్స్ కేరళ 2026 పోటీల్లో విజేతగా నిలిచి.. ఆ టైటిల్‌ను గెలిచిన అత్యంత పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించారు. ఇప్పుడు ఏకంగా మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని దక్కించుకోవడం విశేషం.

**జైపూర్‌లో హోరాహోరీ పోటీ..**

మిస్ యూనివర్స్ ఇండియా 2026 గ్రాండ్ ఫినాలేలో 52 మంది ఫైనలిస్టులు పోటీ పడగా.. కజియా లిజ్ మేజో విజేతగా నిలిచారు. తమిళనాడుకు చెందిన వైష్ణవి గణేష్ ఫస్ట్ రన్నరప్‌గా నిలవగా, గుజరాత్‌కు చెందిన అనుశ్రీ సాతవ్లేకర్ సెకండ్ రన్నరప్‌గా ఎంపికయ్యారు. అంతేకాకుండా అనుశ్రీకి మిస్ ఇంటర్నేషనల్ ఇండియా 2026 టైటిల్ కూడా దక్కింది. ఈ ఫినాలేకు మాజీ మిస్ యూనివర్స్ సుస్మితా సేన్‌తో పాటు మాజీ మిస్ యూనివర్స్ ఇండియా విజేతలు ఊర్వశి రౌతేలా, సెలీనా జైట్లీ తదితరులు జడ్జీలుగా వ్యవహరించారు.

# బంగ్లాదేశ్‌లో హిందూ కుటుంబం హత్య

- ఆ రాత్రి వారి ఇంట్లోనే స్నానం
- భోజనం చేసి వెళ్లిపోయిన నిందితులు
- మృతుడు రిటైర్డ్ టీచర్ గణపతి చక్రవర్తి
- నలుగురిని దారుణంగా హత్య చేసిన ఉదంతం

ఢాకా, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్

బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటుచేసుకున్న హిందూ కుటుంబం దారుణ హత్య ఉదంతంలో విచారణ జరుపుతున్న పోలీసులు.. విస్తుపోయే విషయాలను వెల్లడించారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు గణపతి చక్రవర్తితో పాటు ఆయన కుటుంబ సభ్యులను అత్యంత కఠినంగా మట్టుబెట్టిన హంతకులు.. ఆ రాక్షస కృత్యం ముగిసిన అనంతరం ఏమాత్రం భయం లేకుండా ఆ రాత్రంతా మృతుల ఇంట్లోనే గడిపినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యంగా అక్కడే స్నానం చేసి.. భోజనం కూడా చేసినట్లు పోలీసులు చెప్పారు.

**డ్రగ్స్ వద్దని చెప్పడం వల్లే దారుణం..!**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గణపతి చక్రవర్తి ఇంటికి ఆనుకుని నివాసముంటున్న 19 ఏళ్ల సిద్ధార్థ దాస్, 23 ఏళ్ల ముగ్ధ దాస్ అనే ఇద్దరు యువకులు గురువారం రాత్రి తమ ఇంటి మేడపై నుంచి చక్రవర్తి ఇంటి పైఅంతస్తు మీదికి చేరుకున్నారు. అక్కడే వారు డ్రగ్స్ సేవిస్తుండగా.. మేడపై నుంచి వస్తున్న శబ్దాలను విని గణపతి చక్రవర్తి పైకి వెళ్లారు. వారి ఆగడాలను గమనించి, డ్రగ్స్ సేవించడాన్ని తీవ్రంగా మందలించారు. తమ వ్యసనం, అక్రమ వ్యవహారం ఎక్కడ బయటపడుతుందోనన్న తీవ్ర భయాందోళనకు గురైన ఆ యువకులు.. చక్రవర్తిపై దాడికి దిగారు. ఆయన మెడకు తువ్వాలు గట్టిగా బిగించి ఊపిరాడకుండా చేసి ప్రాణాలు తీశారు.

**అదే ఇంట్లో స్నానం.. ఫ్రిజ్‌లోని తిండి కూడా తిని!**

చక్రవర్తి అరుస్తున్న కేకలు విని ఆయన భార్య వెంటనే మేడపైకి పరుగులు తీసింది. అక్కడ ఆమెను చూసిన నిందితులు.. ఎవరికైనా విషయం చెప్పేస్తుందేమోనని భావించి చంపేశారు. అనంతరం ఎలాంటి ఆధారాలు దొరకకుండా ఉండేందుకు.. విషయాన్ని ఎవరికీ చెప్పకుండా ఉండేందుకు ఇంట్లోనే ఉన్న ఇద్దరు అమాయక పిల్లలను కూడా చంపేశారు. ఈ నలుగురి దారుణ హత్యల అనంతరం నిందితులు ప్రదర్శించిన ప్రవర్తన తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. నలుగురిని దారుణంగా చంపిన తర్వాత కూడా వారు అక్కడి నుంచి వెంటనే పారిపోకుండా.. ఆ రాత్రంతా అదే ఇంట్లో ఉండిపోయారు. రక్తపు మరకలను కడుక్కునేందుకు అక్కడే ప్రశాంతంగా స్నానం చేశారు. అంతేకాకుండా మృతుల ఇంట్లోని ఫ్రిజ్‌లో ఉన్న ఆహారాన్ని బయటకు తీసి కడుపునిండా తిన్నారు.

**సీసీటీవీ ద్వారా వెల్లడైన నిజాలు..!**

తెల్లవారేలోపు అక్కడి నుంచి వెళ్లిపోవాలనుకున్న నిందితులు.. ఇది దొంగలు చేసిన పనిగా మలచాలనుకున్నారు. అందుకోసం ఇంట్లోని బీరువాల తలుపులు తెరిచి, దుస్తులను, ఇతర సామగ్రిని గది అంతటా చిందరవందరగా పడేశారు. ఆపై ఇంట్లోని విలువైన బంగారు ఆభరణాలను దోచుకున్నారు. పోలీసుల విచారణకు ఆటంకం కలిగించేందుకు మృతులకు చెందిన రెండు మొబైల్ ఫోన్లను సమీపంలోని నీటిలో పడేశారు. అయితే సమీపంలో అమర్చిన సీసీటీవీ కెమెరా దృశ్యాలను క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు నిందితులను కచ్చితంగా గుర్తించారు. త్వరితగతిన రెస్క్యూ ప్రక్రియ చేపట్టి సిద్ధార్థ దాస్, ముగ్ధ దాస్‌లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దోచుకెళ్లిన బంగారు నగలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నారు.

# ఢిల్లీని ముంచెత్తిన వాన జనజీవనం అస్తవ్యస్తం

(మొదటి పేజీ తరువాయి)

ఇందులో 12 విమానాలను జైపూర్, రెండింటిని ఛండీగఢ్, మరో విమానాన్ని లక్నోకు తరలించారు. ఏవియేషన్ డేటా ప్రకారం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో విమానాల రాకపోకల్లో సగటున 32 నిమిషాల జాప్యం జరుగుతుండగా, సుమారు 262 విమాన సర్వీసులపై ఈ ప్రభావం పడింది. వర్షాల ధాటికి దేశ రాజధాని పరిధిలో ప్రధాన రహదారులన్నీ జలమయమయ్యాయి.

గుర్గావ్‌లోని సోహ్రా రోడ్ ఇస్లాంపూర్ వద్ద సర్వీస్ లేన్‌లో దాదాపు రెండు అడుగుల మేర నీరు చేరడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. ఢిల్లీలోని సంగమ్ విహార్, ఎంబీ రోడ్ పరిసరాల్లో వాహనాలు గంటల తరబడి చిక్కుకుపోవడంతో ఆఫీసులకు, ఎయిర్‌పోర్ట్‌కు అలాగే సాకేత్ కోర్టుకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఘాజియాబాద్‌లోని NH9 ఇండస్ట్రియల్ ఏరియా అండర్‌పాస్ వద్ద నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ప్రయాణాలను ఆపి రోడ్డు పక్కనే వేచి చూడాల్సి వచ్చింది. అయితే, ఉక్కపోతతో అల్లాడుతున్న ఢిల్లీ ప్రజలకు ఈ వర్షాలు కాస్త ఉపశమనాన్ని ఇచ్చాయి. ఇండియా గేట్, నోయిడా సెక్టార్లలో కురిసిన వర్షాలకు సంబంధించిన దృశ్యాలు ఆహ్లాదకరంగా మారాయి. రాబోయే రోజుల్లో ఢిల్లీఎన్‌సీఆర్ వ్యాప్తంగా మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) హెచ్చరించింది. ముఖ్యంగా ఫరీదాబాద్, గుర్గావ్‌లకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఉత్తరాఖండ్, ఒడిశా, తెలంగాణ రాష్ట్రాల్లో కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది.

# 'ఫీజు బకాయి–బీజేపీ లడాయి'

(మొదటి పేజీ తరువాయి)

ఫీజు బకాయిల కోసం విద్యార్థులు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేస్తే.. వారిపై పోలీసులు దురుసుగా వ్యవహరించడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్కటే కాదు.. తెలంగాణలో యావత్ విద్యా వ్యవస్థ భ్రష్టుపట్టిపోయిందని విమర్శించారు. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే విద్యాశాఖను నిర్వహిస్తున్నారు.. అయినా విద్యా వ్యవస్థను గాలికొదిలేశారని ఆరోపించారు. ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లి రూ.1,000 కోట్లు ఇస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు.. కానీ ఇప్పటివరకు రూ.1,000 కూడా ఇవ్వలేదన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం దాదాపు రూ.8 వేల కోట్ల ఫీజు బకాయిలు పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం మరో రూ.4 వేల కోట్లు పెంచి మొత్తం బకాయిలను రూ.12 వేల కోట్లకు చేర్చిందని తెలిపారు. దాదాపు 20 లక్షల మంది విద్యార్థులకు రూ.12 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని.. దీనికి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వమే వహించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాలేజీలు అధ్యాపకులకు జీతాలు ఇవ్వలేకపోతున్నాయని.. విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలిపివేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ తెలిపారు. "యూత్ డిక్లరేషన్ పేరుతో అనేక హామీలు ఇచ్చి.. అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. హైకోర్టు మొట్టికాయలు వేయడంతో వచ్చే సంవత్సరానికి అడ్వాన్స్‌గా రూ.2 వేల కోట్లు విడుదల చేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు.. ఆ హామీని కూడా నిలబెట్టుకోలేదు. పాలిటెక్నిక్ విద్యార్థులు తమ సమస్యల కోసం పోరాడితే వారిపై లాఠీచార్జ్ చేయించి, పోలీసులతో దురుసుగా వ్యవహరింపజేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆయుష్, హోమియోపతి విద్యార్థులు స్టైఫండ్ల కోసం ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వారి నిరసనలో నేను స్వయంగా పాల్గొన్నాను. రాహుల్ గాంధీ దేశమంతా తిరుగుతూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో విద్యార్థులను రెచ్చగొడుతున్నారు. దమ్ముంటే తెలంగాణకు వచ్చి.. ఇక్కడి విద్యార్థులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై సమాధానం చెప్పాలి. తెలంగాణ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకు ఇవ్వడం లేదు? స్కాలర్‌షిప్‌లు ఎందుకు అందడం లేదు? రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై మా పోరాటం ఆగదు. ఫీజుల బకాయి.. బీజేపీ లడాయి!" అంటూ వ్యాఖ్యానించారు.

# తెలంగాణ రైజింగ్ ఆపలేరు

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా దేశంలోని అనేకమంది నాయకులు, కోట్లాది మంది ప్రజలు తప్పుబడుతున్నారని పేర్కొన్నారు. పరిపాలనాపరమైన ఈ అంశంపై విచక్షణ కోల్పోయి అవాస్తవాలు ప్రచారం చేస్తున్న రాష్ట్ర బీజేపీ నాయకులకు సమాధానం చెప్పాల్సిన అవసరం తనకు లేదని, వారికి ఆ స్థాయి కూడా లేదని తేల్చిచెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనకు.. కేంద్ర విదేశాంగ శాఖ పొలిటికల్ క్లియరెన్స్ఇవ్వకపోవడంతో.. తెలంగాణలో గత కొన్ని రోజులుగా తీవ్ర దుమారం రేపుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే బ్రిటన్, అమెరికా పర్యటనల కోసం విదేశాలకు వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి అమెరికా టూర్ రద్దు కావడంతో.. బ్రిటన్‌లో పర్యటించి.. అక్కడి నుంచి నేరుగా హైదరాబాద్ వచ్చారు. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ రెడ్డి పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై ఇప్పటికే కాంగ్రెస్ నేతలు..కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే తాజాగా మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి.. కేంద్ర ప్రభుత్వం, బీజేపీ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు.

ముఖ్యమంత్రి అమెరికా పర్యటనను అడ్డుకోవడం అంటే తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమేనని రేవంత్ రెడ్డి ఆరోపించారు. అభివృద్ధి, పెట్టుబడుల కోసం వెళ్లేందుకు అనుమతి ఇవ్వకపోవడం అంటే ఇది స్పష్టంగా తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్ష అని అర్థమవుతోందని పేర్కొన్నారు. ఈ విషయాన్ని లోక్‌సభ, రాజ్యసభల్లో తమ పార్టీ సభ్యులు ప్రస్తావిస్తారని తేల్చి చెప్పారు. గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్‌కు మాత్రం అమెరికాలో పర్యటించేందుకు అనుమతించారని.. కానీ తనకు మాత్రం అనుమతి నిరాకరించారని ఆరోపించారు. నరేంద్ర మోదీ దేశానికి ప్రధానమంత్రిగా కాకుండా గుజరాత్ వ్యక్తిగా వ్యవహరిస్తున్నారని రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తాను అమెరికాలో పర్యటిస్తే తెలంగాణకు పెట్టుబడులు వస్తాయని.. విద్య, క్రీడా రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించి.. తన పర్యటనను రద్దు చేశారని ఆరోపించారు. అదే సమయంలో తెలంగాణకు రావాల్సిన పెట్టుబడులు, విదేశీ సంస్థల భాగస్వామ్యం గుజరాత్‌కు తరలించుకుపోయేందుకే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అమెరికా పర్యటనకు అనుమతించారని మండిపడ్డారు. తన అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించిన సీఎం రేవంత్ రెడ్డి.. కానీ తన లక్ష్యాలైన తెలంగాణ అభివృద్ధి, తెలంగాణ రైజింగ్ 2047ను మాత్రం అడ్డుకోలేరని తేల్చి చెప్పారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడులను ఆకర్షించి.. తెలంగాణను ఆర్థికంగా అభివృద్ధి చేయాలనేదే తమ ఆలోచన అని పేర్కొన్నారు. తెలంగాణకు పెట్టుబడులను సాధించుకువచ్చేందుకే విదేశీ పర్యటన రూపొందించామని.. అయితే దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్ర ప్రభుత్వం అడ్డుకుందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని.. దాన్ని మోదీ ప్రభుత్వం చెడగొడుతోందని మండిపడ్డారు. అమెరికా పర్యటనలో ప్రపంచంలోనే ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పామని.. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్రం తమకు బదులిచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ ముఖ్యమంత్రికి మాత్రం అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారని పేర్కొన్నారు. తన పర్యటనను అడ్డుకోవడం అంటే అది రేవంత్ రెడ్డికి జరిగిన అవమానం కాదని.. 4 కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించడమేనని తేల్చి చెప్పారు.

# కాస్త ఆలస్యమైనా నదుల అనుసంధానం చేస్తాం

నూజివీడు, ఆగస్ట్ 24, అనంత జనశక్తి న్యూస్

**నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరులో నాన్-జీఎంఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాన్ని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. 'నేను తెలుగు అర్థం చేసుకోగలను, కానీ మాట్లాడలేను. రెండు నెలల క్రితం తమిళ పత్రికలో గౌర్మెట్ సంస్థ ఎండీ పట్టాభి సక్సెస్ స్టోరీని చదివాను. ఒకే ఒక ఉత్పత్తిని ప్రపంచంలోనే గుర్తింపు తీసుకురావడంపై ఆయనను అభినందిస్తున్నాను. జనవరి 14న దేశమంతా కలిసి పంటల పండుగను జరుపుకుంటాం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో సంక్రాంతిగా, తమిళనాడులో పొంగల్, పంజాబ్‌లో లోహిరి, అసోంలో బిహుగా జరుపుకుంటారు' అని చెప్పకొచ్చారు.**

**రైతులకు వివిధ పథకాలను అమలుచేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఉపరాష్ట్రపతి అభినందించారు. డ్రోన్లను రైతులకు అద్దెకు ఇచ్చే పథకానికి కేంద్రం రూ.1200 కోట్లను మహిళా సంఘాలకు కేటాయించిందన్నారు. పాప్ కార్న్ మొక్కజొన్నను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవడం మానేసి, మనమే ఆ దేశానికి ఎగుమతి చేసే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఎనిమిది రాష్ట్రాల్లో 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో పాప్ కార్న్ మొక్కజొన్నను పండించడం మామూలు విషయం కాదన్నారు. ఈ ఏడాది దేవుని కృపతో అవసరమైన వర్షా లు కురుస్తాయని.. దాని గురించి ఆందోళన వద్దని చెప్పారు. మహానది నుంచి కావేరి నది వరకు నదుల అనుసంధానం కలగా మిగలదని.. కొంత ఆలస్యం కావచ్చుగానీ, వాస్తవ రూపం దాల్చుతుందని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు. మన ఆహార అవసరాల కోసం ఇతర దేశాలపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. ఆహార అవసరాలను తీర్చడానికి రైతులకు అవసరమైన సహాయ సహకారాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయని ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పేర్కొన్నారు.**

# మతం మారాలని సాధిక్ ఒత్తిడి చేశాడు

- ఏఈ నూకరాజు కుటుంబం సూసైడ్ కేసు
- సాధిక్ ఖాన్ వేధింపులతోనే ఆత్మహత్యలు

కాకినాడ, ఆగస్ట్ 24, అనంతజనశక్తి న్యూస్

కాకినాడ జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించిన ఏఈ నూకరాజు కుటుంబం సామూహిక ఆత్మహత్య కేసు విచారణలో కీలక పురోగతి లభించింది. ఈ దారుణ ఘటనకు కారణమైన ప్రధాన నిందితుడు, రైఫిల్ షూటింగ్ కోచ్ సాధిక్ ఖాన్‌ను పోలీసులు ఉత్తరప్రదేశ్‌లో అరెస్టు చేశారు. కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ బిందుమాధవ్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ విషాద ఘటనలో ఏఈ నూకరాజు, ఆయన భార్య మీనా, కుమార్తె సౌజన్య, మనవడు రియాన్స్ రెడ్డి గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు యత్నించారు. ఈ ఘటనలో చిన్నారి రియాన్స్ రెడ్డి ప్రాణాలతో సురక్షితంగా బయటపడగా, నూకరాజు, మీనా, సౌజన్య నీట మునిగి ప్రాణాలు కోల్పోయారు. మొదట ఈ ఘటనపై రాజమహేంద్రవరంలో కేసు నమోదవ్వగా, ఘటన వెనక ఉన్న అసలు కారణాలు విచారణలో బయటపడ్డాయి. పోలీసులు జరిపిన తనిఖీల్లో రెండు వేర్వేరు సూసైడ్ నోట్‌లు లభించాయి. ఒక లేఖ నూకరాజు వద్ద లభించగా, మరొకటి ఆయన కుమార్తె సౌజన్యకు చెందిన స్కూటీలో దొరికింది. సాధిక్ ఖాన్ తమను తీవ్రంగా మానసిక, శారీరక వేధింపులకు గురిచేశాడని, ఆస్తిపై కన్నువేసి బ్లాక్‌మెయిల్ చేశాడని లేఖల్లో పేర్కొన్నారు. అంతేకాకుండా, సౌజన్యపై బలవంతంగా మతం మారాలని సాధిక్ తీవ్ర ఒత్తిడి తెచ్చినట్లు లేఖల ద్వారా స్పష్టమైంది. బాధితురాలు సౌజన్య మామ భాస్కర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా సర్పవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైందని ఎస్పీ తెలిపారు. సామూహిక ఆత్మహత్యల అనంతరం నిందితుడు సాధిక్ ఖాన్ పరారయ్యాడు. అతడి కోసం కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పోలీసులతో కూడిన 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఐదు రాష్ట్రాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. చివరికి ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మేరఠ్‌లో సాధిక్ ఆచూకీ కనుగొన్నారు. అక్కడ తన స్నేహితులకు తన ఫోన్, డబ్బు పోయాయని మాయమాటలు చెప్పి తలదాచుకున్నట్లు ఎస్పీ తెలిపారు. మేరఠ్ స్థానిక కోర్టులో హాజరుపరిచి, ట్రాన్సిట్ వారెంట్‌పై అతడిని కాకినాడకు తీసుకువచ్చారు. సాధిక్ ఖాన్‌పై హత్య, బలవంతపు మతమార్పిడి, ఆత్మహత్యకు ప్రేరేపించిన తీవ్రమైన చట్టపరమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని ఎస్పీ వెల్లడించారు. నిందితుడిని స్థానిక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, తదుపరి విచారణ నిమిత్తం పోలీస్ కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరనున్నారు.

కస్టడీలో విచారిస్తే వేధింపులకు సంబంధించిన మరిన్ని నిజాలు వెలుగులోకి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు. ఇలాంటి ఇబ్బందికర పరిస్థితులు, బెదిరింపులు ఎదురైనప్పుడు క్షణికావేశంలో తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని, ధైర్యంగా పోలీసులను ఆశ్రయిస్తే తగిన రక్షణ కల్పిస్తామని ఎస్పీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# షేర్ చేస్తే చర్యలు తప్పవు ఆ ఎన్నికల షెడ్యూల్ అబద్ధం

(మొదటి పేజీ తరువాయి)

**మరోవైపు సోషల్ మీడియాలో కొంతమంది షేర్ చేస్తున్నది ఫేక్ ఎన్నికల షెడ్యూల్‌గా పేర్కొన్న ఏపీ ఎన్నికల కమిషనర్.. అందులో ఎలాంటి వాస్తవం లేదని క్లారిటీ ఇచ్చారు. వాట్సప్ వంటి సోషల్ మీడియాలో వచ్చే ఎన్నికల తేదీలను నమ్మొద్దని.. అలాంటి వాటిని ఇతరులకు ఫార్వర్డ్ చేయొద్దని సూచించారు. అలా కాకుండా ఎవరైనా ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని ఏపీ ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా హెచ్చరించారు. ఫేక్ ఎన్నికల షెడ్యూల్‌ను షేర్ చేస్తే.. అలాంటి వారిపై సైబర్ చట్టాల కింద కేసులు నమోదు చేస్తామని వార్నింగ్ ఇచ్చారు.**

**ఇక స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి.. ఎలాంటి సమాచారం అయినా పత్రికా ప్రకటన రూపంలో లేదా.. మీడియా సమావేశం ద్వారానే వెల్లడిస్తామని అనిల్ చంద్ర పునేఠా స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక ప్రకటన కాకుండా.. అనధికారిక సమాచారాన్ని నమ్మవద్దని కోరారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం కసరత్తు ప్రారంభించిన సంగతి తెలిసిందే. బీసీ రిజర్వేషన్ల అమలు కోసం కమిషన్ నుంచి అందిన నివేదికను పరిశీలించి..స్థానిక ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఏపీ అసెంబ్లీ చట్టం కూడా చేసింది. ఈ క్రమంలోనే ఏపీలో స్థానిక ఎన్నికల షెడ్యూల్ అంటూ నెట్టింట వార్తలు వైరల్ అవుతున్నాయి. దీనిపై ఏపీ ఎన్నికల సంఘం క్లారిటీ ఇచ్చింది.**

# పార్లమెంటు శాసనం కంటే కాంగ్రెస్ తీర్మానం గొప్పదా?



వందేమాతరం విషయంలో కాంగ్రెస్ వైఖరి.. సింహం తోలు కప్పుకొన్న నక్కలా ఉందని భాజపా ధ్వజమెత్తింది. ఇలా చేసినా నక్క ఎప్పటికీ సింహం కాలేదని ఎద్దేవాచేసింది. బుజ్జగింపు రాజకీయాలను ఎల్లకాలం దాయలేరని, ఏదో ఒకనాడు ముసుగు తొలగిపోయి స్వార్థం బట్టబయలవుతుందని కాంగ్రెస్‌ను ఉద్దేశించి ఘాటుగా వ్యాఖ్యానించింది. వందేమాతరంలో రెండు చరణాలు మాత్రమే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) తీర్మానించడాన్ని ఖండించింది. 1930వ దశకంనాటి బుజ్జగింపు రాజకీయ విధానాన్నే కాంగ్రెస్ ఎంచుకుందని విమర్శించింది. భాజపా నూతన పదాధికారుల తొలి సమావేశాన్ని శనివారం దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. అధ్యక్షుడు నితిన్ నబీన్ దీనికి అధ్యక్షత వహించారు. 10 అంశాలతో ఈ సమావేశం ఒక తీర్మానం చేసింది. యువతకు ప్రాధాన్యమిచ్చి, వారితో నిరంతరం మాట్లాడుతుండాలని అధ్యక్షుడు నొక్కి చెప్పారు.

**..అప్పటి నుంచీ సమాన హోదా**

"స్వాతంత్ర్య సంగ్రామంలో చారిత్రక పాత్ర పోషించిన వందేమాతరానికి జనగణమనతో సమాన గౌరవం, హోదా కల్పిస్తున్నట్లు తొలి రాష్ట్రపతి, రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 1950లోనే వెల్లడించారు. అధికారిక రాజకీయ ప్రొటోకాల్‌లో జాతీయ గీతంగా జనగణమన స్థిరపడగా, దాంతో సమానమైన గౌరవంతో జాతి చైతన్య గేయంగా వందేమాతరం ప్రతిష్ఠితమైంది. స్వాతంత్ర్యానంతరం వందేమాతరంలోని మొదటి రెండు చరణాలే బహిరంగ గానానికి పరిమితం కావడంతో అదే సంప్రదాయంగా మారింది. మిగిలిన నాలుగు చరణాలు కొత్త తరాలకు అపరిచితంగా మిగిలిపోయాయి. మోదీ ప్రభుత్వ కృషితో జనగణమనతో సమానమైన చట్టరక్షణ వందేమాతరానికీ ఇప్పుడు లభించింది. సంపూర్ణ వందేమాతరం దేశ గౌరవప్రతిష్ఠలు, వారసత్వానికి సంబంధించిన విషయం. దాని పూర్ణ స్వరూపాన్ని భాజపా కాపాడుతుంది. 1950నాటి రాజ్యాంగ సభ ప్రకటన, పార్లమెంటులో ప్రస్తుతం చేసిన చట్టం కంటే 1937లో కాంగ్రెస్ చేసిన రాజకీయ తీర్మానం గొప్పదేమీ కాదు. వందేమాతరం గీతాన్ని రెండు చరణాలకు పరిమితం చేయడం వెనక చారిత్రక, రాజకీయ నేపథ్యాన్ని ప్రజల ముందుంచుతాం. వందేమాతర గీతం సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదమని, స్వచ్ఛమైన జాతీయ భావన అని మహాత్మాగాంధీ అభివర్ణించారు. ఆ విషయాన్ని ప్రజలందరికీ చెబుతాం. బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన వందేమాతర గీతాన్ని అణచివేయడానికి తీవ్రంగా జరిగిన ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టారు. వారసత్వ వైభవాన్ని ఓటుబ్యాంకు రాజకీయ గణాంకాల స్థాయికి దిగజార్చకూడదు" అని తీర్మానంలో భాజపా పేర్కొంది. రాష్ట్ర శాఖల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో నబీన్ విడిగా సమావేశమై సమాలోచనలు జరిపారు.

**కొత్త జట్టుతో మోదీ...**

నూతన కార్యవర్గంతో ప్రధాని మోదీ శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో భేటీ అయ్యారు. పార్టీని బలోపేతం చేసే ఆలోచనలు పంచుకోవడం, ప్రజలతో మరింతగా సంబంధాల విషయంలో ఇలాంటివి ఉపయోగపడతాయని 'ఎక్స్'లో ఆయన పేర్కొన్నారు. కొత్త జట్టును కలవడం మంచి అనుభూతి అని అన్నారు.

**ప్రభుత్వాధినేతగా పాతికేళ్లు.. నెలరోజుల సేవా కార్యక్రమాలు**

ప్రభుత్వాధినేతగా అక్టోబరు 17కి మోదీ 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా నెలరోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని భాజపా నిర్ణయించింది. సెప్టెంబరు 17న (ఆయన పుట్టినరోజునాడు) ఇవి మొదలవుతాయి. యువత, రైతులు, మహిళలు సహా సమాజంలో అన్నివర్గాలవారిని కలిసేందుకు పార్టీ వివిధ కార్యక్రమాలు చేపట్టనుంది. దీనిపై పార్టీ కార్యాలయంలో విడిగా జాతీయస్థాయి వర్క్‌షాపు నిర్వహించింది. త్వరలో రాష్ట్రస్థాయిలోనూ ఇలాంటివి జరగనున్నాయి.

# ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగిలించడానికి కారులో వెళ్తే..



పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించడానికి ముగ్గురు దొంగలు వేసిన ప్లాన్ బెడిసికొట్టింది. చోరీకి వెళ్తుండగా.. వారి కారు బురదలో చిక్కుకుపోవడంతో ఎరక్కపోయి ఇరుక్కుపోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ఘటన పంజాబ్ లోని మోగా జిల్లాలో చోటుచేసుకుంది. తఖ్తుపుర గ్రామంలోని ఓ పొలంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించడానికి శనివారం రాత్రి ముగ్గురు దొంగలు కారులో వెళ్లారు. పొలాల మధ్యలో నుంచి ప్రయాణిస్తుండగా వారి కారు అదుపుతప్పి.. పొలంలో దిగబడింది. దానిని బయటకు తీయడానికి ప్రయత్నించినప్పటికీ సాధ్యం కాకపోవడంతో కారును అక్కడే వదిలేసి వెళ్లిపోయారు.

మర్నాడు ఉదయం కారును బయటకు తీయడానికి దొంగలు ఓ ట్రక్కును తీసుకొచ్చారు. అదికూడా బురదలో కూరుకుపోవడంతో ఏం చేయాలో తెలియక దొంగలు తెల్లమొహం వేశారు. ఈ తతంగమంతా అనుమానాస్పదంగా ఉండడంతో స్థానికులు ప్రశ్నించారు. దానికి వారు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో.. గట్టిగా నిలదీయగా చోరీ ప్లాన్ బయటపడింది. దీంతో దొంగలు పారిపోయేందుకు ప్రయత్నించగా.. వారిలో ఒకరిని గ్రామస్థులు పట్టుకున్నారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేసి, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మిగతా ఇద్దరి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. ఇటీవల జిల్లాలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు చోరీకి గురయ్యాయి. వాటి వెనుక ఈ గ్యాంగ్ హస్తం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# 10 రోజులైనా లోక్‌సభను ఎందుకు ప్రోరోగ్ చేయలేదు: కాంగ్రెస్



లోక్‌సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడి 10 రోజులు గడిచినప్పటికీ.. ఇప్పటికీ సభను ప్రోరోగ్ చేయకపోవడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుబట్టింది. డీలిమిటేషన్ బిల్లును తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్న ఆలోచనలో ఉందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. అందుకోసం కేంద్రమంత్రి అమిత్‌షా 2/3 మెజారిటీ కోసం వెతుకులాటలో ఉన్నారంటూ ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. 2029 నుంచే మహిళా రిజర్వేషన్లను అమలు చేయడంతో పాటు, లోక్‌సభ స్థానాలను 50 శాతం మేర పెంచే ఉద్దేశంతో తీసుకొచ్చిన రాజ్యాంగ సవరణ బిల్లులు గత సమావేశాల్లో వీగిపోయిన సంగతి తెలిసిందే. దీంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో ఈ బిల్లులు ప్రవేశ పెడతారని భావించారు. కానీ, ప్రభుత్వం ఏ కారణం చేతనో వెనక్కి తగ్గింది. ఇందుకోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారన్న అంశం తెరపైకి వచ్చింది.


ఈ నేపథ్యంలో జైరాం రమేశ్ స్పందించారు. "లోక్‌సభ సమావేశాలు ముగిసిన తర్వాత ప్రోరోగ్ చేయడానికి సాధారణంగా 24 రోజుల వ్యవధి ఉంటుంది. కొన్నిసార్లు రెండూ ఒకేరోజు నిర్వహించిన సందర్భాలూ ఉన్నాయి. కానీ, లోక్‌సభ వాయిదాపడి 10 రోజులు గడుస్తున్నా.. ప్రోరోగ్‌కు సంబంధించిన సమాచారం లేదు. 2015, 2021లో నిరవధిక వాయిదాకు, ప్రోరోగ్‌కు మధ్య కాస్త గ్యాప్ ఉన్నప్పటికీ.. ఆ సమయంలో ఎలాంటి దుష్ట పన్నాగాలూ జరగలేదు. బహుశా ప్రత్యేక సమావేశాలు పెట్టి రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేసుకోవడానికి హోంమంత్రి అమిత్‌షా 2/3 మెజారిటీ కోసం వెతుకులాడుతున్నట్లు ఉన్నారు" అంటూ జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు.

# విద్యార్థినులతో జలకాలాటలు.. ప్రిన్సిపల్ సస్పెన్షన్

రాజస్థాన్‌లోని అల్వార్ జిల్లాలో 11, 12 తరగతుల విద్యార్థినులను జలాశయంవద్దకు విహార యాత్రకు తీసుకెళ్లి.. వారితో కలిసి జలకాలాడిన ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపల్‌పై సస్పెన్షన్ వేటు పడింది. సామాజిక మాధ్యమాల్లో ఈ వీడియో వైరల్ కావడంతో ప్రభుత్వ సీనియర్ సెకండరీ స్కూలు ప్రిన్సిపల్ లాల్‌చంద్ మీనాను సస్పెండు చేస్తూ బీకానేర్ డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థినుల ఎదుట దుస్తులు లేకుండా ఈతకు దిగిన ఆయన తీరు ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఉన్నట్లు పేర్కొంది. మీనాపై శాఖాపరమైన దర్యాప్తు మొదలైంది. పాఠశాల సమీపంలోని డ్యాం వద్దకు మొత్తం 200 మందికిపైగా విద్యార్థులను ఆగస్టు 15న ప్రిన్సిపల్ తీసుకెళ్లారు.



# ఐవీఎఫ్‌తో 'లఖిమి' దూడ అస్సాంలో జననం



దేశీయ పశు జాతుల పరిరక్షణలో అస్సాం మరో కీలక ముందడుగు వేసింది. పశు సంవర్ధక, బయోటెక్నాలజీ రంగంలో ఒక చరిత్రాత్మక మైలురాయిని నమోదు చేసింది. అస్సాంకు చెందిన ప్రసిద్ధ స్వదేశీ 'లఖిమి' జాతి పెయ్యి దూడ ఐవీఎఫ్ (ఇన్ విట్రో ఫలదీకరణ) పద్ధతిద్వారా జన్మించింది. రాష్ట్రంలో పశు సంపద సంరక్షణ, పాడి పరిశ్రమ అభివృద్ధి దిశగా పరిశోధనలు చేస్తున్న అస్సాం వెటర్నరీ అండ్ ఫిషరీ యూనివర్సిటీ ఈ ఘనత సాధించింది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన 'రాష్ట్రీయ గోకుల మిషన్' ఆర్థిక సహాయంతో యూనివర్సిటీ ప్రయోగశాలలో దీనికి సంబంధించిన ప్రత్యేక ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. స్వచ్ఛమైన లఖిమి జాతి ఆవు పిండం ద్వారా ఈ దూడను ఉత్పత్తి చేశారు.

# అసెంబ్లీల ఎన్నికలపై భాజపా సమాలోచన



వచ్చే ఏడాది ఉత్తర్ ప్రదేశ్, గుజరాత్ సహా ఏడు రాష్ట్రాల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబీన్ ఆదివారం కీలక సమావేశం నిర్వహించారు. ఆయా రాష్ట్రాల కార్యవర్గ సభ్యులతో సంస్థాగత విషయాలపై చర్చించారు. జాతీయ కార్యవర్గంలో ఉన్న నేతలు, ఆయా రాష్ట్రశాఖల అధ్యక్షులు, పార్టీ వ్యవహారాల బాధ్యులు, ఇతర ముఖ్య నేతలు దీనిలో పాల్గొన్నారు. ప్రజలతో సత్సంబంధాలు, ముఖ్యంగా యువతతో అనుసంధానం కావడంపై చర్చించారు. సమావేశ వివరాలను పార్టీ అధికారికంగా వెల్లడించలేదు. 2027లో యూపీ, గుజరాత్‌తోపాటు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, మణిపుర్, గోవాల్లో ఎన్నికలు జరగనున్నాయి. వీటిలో విజయం సాధించేందుకు ఎలాంటి వ్యూహం అనుసరించాలనేది నబీన్

# ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి.. ఒకరోజు ముందే యూట్యూబ్‌లో వీడియో పెట్టిన తల్లి



మహారాష్ట్ర లోని ఛత్రపతి సంభాజీనగర్ జిల్లాలో ఇటీవల ఐ ఫోన్ వివాదమై ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనకు ఒకరోజు ముందు యువకుడి తల్లి సంగీత తన యూట్యూబ్ ఛానల్‌లో పెట్టిన వీడియో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మానవ సంబంధాలు, ప్రేమ విలువలను వీడియోలో వివరించారు. మన ప్రేమను విలువైనదిగా భావించే వ్యక్తికే మనస్ఫూర్తిగా ఏదైనా చేయాలని సూచించారు. విలువ ఇవ్వని వ్యక్తి కోసం ఎంత చేసినా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. రెండు వైపులా కాలితేనే చపాతీ రుచిగా ఉంటుందంటూ కుటుంబ బంధాల ప్రాధాన్యాన్ని వివరించారు. తన యూట్యూబ్ ఛానల్‌లో తరచూ మోటివేషనల్ వీడియోలను పంచుకుంటూ ఉంటారు. ప్రస్తుతం ఆమె ఛానల్‌కు 29వేల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. తన కుమారుడితో కలిసి షార్ట్ వీడియోలను చేస్తుంటారు. ఆరేళ్ల కిందట పెద్ద కుమారుడు అనారోగ్యంతో మరణించిన సమయం నుంచి ఆమె తన భర్తకు దూరంగా ఉంటున్నారు. భర్తకు దూరం కావడానికి, కుటుంబంలో తలెత్తిన మనస్పర్థలకు ఆడపడుచుల ప్రవర్తనే కారణమని తీవ్ర ఆరోపణలు చేశారు.

కునాల్ అనే యువకుడు ఐఫోన్ ఈఎంఐ డబ్బుల కోసం గొడవపడి కొండపై నుంచి దూకగా.. అతన్ని కాపాడే ప్రయత్నంలో తండ్రి మురళీధర్ లోయలో పడిపోయాడు. కళ్లెదుటే భర్త, కుమారుడు మృతి చెందడం తట్టుకోలేక.. సంగీత కూడా అదే కొండపై నుంచి దూకి ప్రాణాలు విడిచిన హృదయ విదారక ఘటన ఇటీవల తీవ్ర కలకలం రేపింది.

# అత్తింటి వారి వేధింపులు.. రక్షణశాఖ అధికారిణి ఆత్మహత్య..



కేంద్ర రక్షణశాఖ కు చెందిన అధికారిణి దిల్లీలోని తమ నివాసంలో ఆత్మహత్య చేసుకున్నారు. రక్షణ శాఖ కార్యాలయంలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న నాజియా ఖానమ్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. అత్తింటి వారి వేధింపులు తట్టుకోలేకే తన కుమార్తె మృతిచెందిదని మృతురాలి తండ్రి తవాబ్ ఖాన్ ఆరోపించారు. ఏప్రిల్ 11, 2026న ఆజమ్ అలీ ఖాన్‌తో తమ కుమార్తె నాజియాకు వివాహం జరిపించామని.. పెళ్లి అయిన వారం నుంచే వారు వేధిస్తున్నారని తమకు చెప్పిందని పేర్కొన్నారు. ఆమె భర్తే తమ కుమార్తెను హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. భర్త తనను శారీరకంగా.. మానసికంగా వేధిస్తున్నాడని తమ కుమార్తె పలుమార్లు చెప్పిందని తవాబ్ ఖాన్ పేర్కొన్నారు. అత్తమామలు తరచూ తిడుతున్నారని.. అదనపు కట్నం తేవాలని బలవంతం చేస్తున్నారని చెప్పి బాధ పడిందన్నారు. కొద్ది రోజుల తర్వాత వెళ్లి మాట్లాడదామనున్నామని.. ఇంతలోనే ఆమె ప్రాణాలు కోల్పోయిందని తెలిపారు. తమ కుమార్తె మూడు నెలల గర్భవతి అని పేర్కొన్నారు. తమ అల్లుడి తండ్రి మాజీ పోలీసు అధికారి కావడంతో.. దిల్లీ పో లీసులు కూడా ఈ కేసును బయటకు రాకుండా చేయడానికి ప్రయత్నించారని ఆరోపించారు. అయితే నాజియానే ఆత్మహత్య చేసుకుందని ఆమె భర్త పోలీసులకు తెలిపాడు. శుక్రవారం తమ మధ్య వాగ్వాదం జరిగిందని.. దీంతో నాజియా మరో గదిలోకి వెళ్లి తలుపేసుకుందని పేర్కొన్నారు. కొద్ది సేపటి తర్వాత వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు ఉరేసుకొని కనిపించిందన్నారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# అభయారణ్యంలో.. అరుదైన నీటిబాతు

అస్సాంలోని లావోఖోవా వన్యప్రాణుల అభయారణ్యంలో అరుదైన వలస పక్షి స్మ్యూ డక్ (ఎగిరే నీటిబాతు) తొలిసారిగా కనిపించింది. వన్యప్రాణుల సంరక్షణలో సురక్షితమైన ఈ ప్రాంత చరిత్రలో ఇదో మైలురాయిగా రాష్ట్ర అటవీ, పర్యావరణ మార్పుశాఖల మంత్రి జయంత్ మల్లా బారువా ఆదివారం వెల్లడించారు. కాజీరంగా నీటిపక్షుల ఏడో గణన2026లో భాగంగా ఈ పక్షిని గుర్తించారు. నాగావ్ జిల్లా పరిధిలో బ్రహ్మపుత్ర నది ఒడ్డున ఈ అభయారణ్యం 70.13 చదరపు కిలోమీటర్లు విస్తరించి ఉంది.





# రైతాంగం భవితకు కొత్త భరోసా

దేశీయ సేద్య రంగం సాంప్రదాయ పంట విధానాల నుంచి ఒక మౌలికమైన మార్పును సంతరించుకుంటోంది. వ్యవసాయ అటవీ విధానం (ఆగ్రోఫారెస్ట్రీ) అనే పదాన్ని వృక్షాధార వ్యవసాయం (ట్రీ బేస్డ్ ఫార్మింగ్)గా మార్చే వ్యూహాత్మక నిర్ణయం దిశగా కేంద్రం అడుగులు వేస్తోంది. ఇది కేవలం పేరు మార్పునకే పరిమితం కాదు; పర్యావరణ స్థిరత్వానికీ, గ్రామీణ ఆర్థిక భద్రతకూ మధ్య ఒక బలమైన వారధిని నిర్మించగలదు.

భారత్ 'ఆగ్రోఫారెస్ట్రీ' పేరును ఎందుకు మార్చాల్సి వస్తుందన్నది అర్థం చేసుకోవాలంటే- ముందుగా 2014 నాటి ఈ విధానం తాలూకా ప్రాతిపదికను పరిశీలించాలి. పర్యావరణ లక్ష్యాలను చేరుకోవడానికి చెట్ల విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతోపాటు కలప, ఇంధన కలప, పశుగ్రాసాలకు ఉన్న గిరాకీ-సరఫరా మధ్య అంతరాన్ని పూడ్చడం ఆగ్రోఫారెస్ట్రీ ప్రధాన లక్ష్యం. అందుకని వేర్వేరు శాఖల పరిధిలో చెల్లాచెదురుగా ఉన్న కార్యక్రమాలను ఒక్క తాటిపైకి తీసుకురావడానికి ఈ విధానం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. ముఖ్యంగా వ్యవసాయం, పర్యావరణం, అటవీ, వాతావరణ మార్పుల శాఖలను అనుసంధానించింది. పొలాల్లో పెరిగే చెట్ల నరికివేత, రవాణా నిబంధనలను సరళతరం చేయడం 2014 నాటి విధానంలో కీలకాంశం. చెట్ల పెంపకం రైతులకు నమ్మకమైన అదనపు ఆదాయ వనరుగా మారుతుందనీ; నాణ్యమైన విత్తనాలు, సాగు పరికరాలు, వ్యవస్థాగత రుణాలు, బీమా సదుపాయం సమకూర్చడం ద్వారా వారికి రక్షణ కల్పించవచ్చని ఆగ్రోఫారెస్ట్రీ విధానం ఆశించింది. కానీ వ్యవసాయ, అటవీ రంగాల మేళవింపు సుదీర్ఘకాలంపాటు సంక్లిష్టమైన నియంత్రణ చట్రాల కిందే ఉండిపోయింది. అటవీ శాఖ చెట్ల నరికివేత, రవాణాపై కఠినమైన నిబంధనలను అమలుచేస్తూ వచ్చింది. ప్రభుత్వ అటవీ భూములను రక్షించడానికీ, కలప అక్రమ రవాణాను నిరోధించడానికీ, మొత్తంగా పర్యావరణ ఆరోగ్యాన్ని పెంపొందించడానికీ ఈ నిబంధనలు అవసరమే. కానీ, ఒక సామాన్య రైతు తన పొలంలోని చెట్లను నరికి, కలపను మార్కెట్‌కు రవాణా చేయడానికి వీటి వల్ల చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. దీంతో ఈ నిబంధనలను రైతులు అభివృద్ధి నిరోధకాలుగా భావించారు.

**పేరు మార్పుతో ఏమవుతుంది?**

ఆగ్రోఫారెస్ట్రీ అనే పదంలో 'అటవీ' అనే పదముంది. ఇది తెలియకుండానే అటవీ సరిహద్దులు, అధికారిక తనిఖీలు, సంక్లిష్టమైన చట్టాలతో ముడిపెడుతుంది. తమ సొంత భూమిలో వాణిజ్యపరమైన చెట్లను పెంచితే, అటవీ అధికారుల నుంచి ఇబ్బందులు ఉంటాయనే ఆందోళన చాలామంది చిన్నరైతుల్లో బలంగా పాతుకుపోయింది. ఈ భయాన్ని తొలగించడానికే ఇప్పుడు 'వృక్షాధార వ్యవసాయం'గా పేరు మార్చాలని ప్రభుత్వం తలపోసింది. ఇందులో వ్యవసాయం అనే పదాన్ని స్పష్టంగా ఉపయోగించడం ద్వారా చెట్లను గోధుమలు, వరి, చెరకు వంటి సాధారణ వ్యవసాయ పంటలతో సమానంగానే గుర్తిస్తుంది. దీనివల్ల, తాము పెంచే కలప పూర్తిగా వ్యవసాయం పరిధిలోకే వస్తుందన్న భరోసా రైతులకు కలుగుతుంది.

చాలా రాష్ట్రాలు ఇప్పటికే యూకలిప్టస్, పాప్లర్, సరుగుడు, వేప, సుబాబుల్ వంటి చెట్లను నరికివేత, రవాణా అనుమతుల నుంచి పూర్తిగా మినహాయించాయి. కానీ, అడవులలో లభించే టేకు వంటి విలువైన వృక్ష జాతులను రక్షించడానికి రైతులు కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. మునుపు వెదురును నరకడం, రవాణా చేయడంపై భారీ జరిమానాలు ఉండేవి. అయితే, కేంద్రం అటవీయేతర భూముల్లో పెంచే వెదురును 'చెట్టు' నిర్వచనం నుంచి పూర్తిగా తొలగించింది. ఈ చారిత్రక నిర్ణయంతో రైతులు, ముఖ్యంగా ఆదివాసులు తమ పొలాల్లో వెదురును నాటడం, పెంచడం, నరకడం, రాష్ట్ర సరిహద్దులు దాటించి రవాణా చేయడం వీలవుతుంది. ఈ చట్టసవరణ వ్యవసాయ ఆధారిత జీవనోపాధులను, అగర్‌బత్తి, కాగితం తయారీ, నిర్మాణ రంగ పరిశ్రమలకు భారీ అవకాశాలను తెరుస్తుంది. అయితే, అడవులలో పెరిగే వెదురు జాతుల విషయంలో ఇప్పటికీ కొన్ని సహేతుకమైన అభ్యంతరాలు ఉన్నాయి. ఈ విషయంలో వివిధ శాఖల సమన్వయంతో ముందుకు వెళ్లాల్సిన అవసరముంది. ఇటువంటి సంస్కరణల విషయంలో ఏపీ, తెలంగాణలు ఇప్పటికే ముందంజలో ఉన్నాయి. రైతులు ప్రభుత్వ జోక్యంతో కలపను పండించి పేపర్ మిల్లులు, ప్లైవుడ్ పరిశ్రమలకు రవాణా చేసేందుకు వీలుగా పరిశ్రమ అనుసంధాన వ్యవస్థలను అమలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం తనిఖీ కేంద్రాల స్థానంలో 'నేషనల్ ట్రాన్సిట్ పాస్ సిస్టమ్' కింద డిజిటల్ పాస్‌లను తీసుకొచ్చింది. ఈ విధానాన్ని మరింత క్రమబద్ధీకరించాల్సిన అవసరముందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**లాభదాయకమైన జీవనోపాధి...**

చాలామంది రైతులు ఒకే తరహా పంటలను వేస్తుంటారు. దీంతో మద్దతు ధరలు లభించక నష్టపోతున్నారు. మొక్కల పెంపకం కొన్నేళ్ల తరవాత మంచి ఆదాయాన్ని ఇస్తుంది. కాబట్టి, ప్రధాన పంటను నష్టపోయినా రైతులను చెట్లు ఆదుకుంటాయి. పొలాల్లో మొక్కల పెంపకం వల్ల వాటి నీడ, రాలిన ఆకులు నేలను సారవంతం చేస్తాయి. దాంతో ప్రధాన పంట ఉత్పత్తి పెరుగుతుంది. మరోవైపు పాడిపరిశ్రమ, తేనెటీగలు, చేపల పెంపకానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. వృక్షాధార వ్యవసాయం కింద రైతులకు మరింత ఆర్థిక తోడ్పాటు అందించాలని ప్రభుత్వం లక్షిస్తోంది. ఇందులో భాగంగా మొక్కల పెంపకాన్ని గ్రామీణ పథకాలతో అనుసంధానించడం, అధిక దిగుబడినిచ్చే జాతుల (క్లోన్‌ల) కోసం సబ్సిడీలను అందించడం, తక్కువ వడ్డీకి రుణాలివ్వడం వంటి చర్యలు తీసుకుంటారు. చెట్లకూ బీమా సౌకర్యం పొందే అవకాశముంటుంది. భారత్ ఆగ్రోఫారెస్ట్రీ నుంచి వృక్షాధార వ్యవసాయానికి మారడం సేద్యరంగంలో వస్తున్న ఒక ముఖ్యమైన పరిణామం. ఇది అటవీ చట్టాలను గౌరవిస్తూనే, రైతుల ఆర్థిక ప్రయోజనాలనూ కాపాడుతుంది. చెట్ల పెంపకాన్ని సురక్షితమైన, లాభదాయకమైన జీవనోపాధి వ్యూహంగా మారుస్తుంది.



# రాజకీయాల్లో 'సోషలిస్ట్' హవా!

**ఒకటిన్నర దశాబ్దం తర్వాత అమెరికా భారీ రాజకీయ కుదుపునకు లోను కాబోతున్నదా? చాపకింద నీరులాగా డెమోక్రాట్లలో తమ ప్రాబల్యం పెంచుకుంటున్న డెమోక్రటిక్ సోషలిస్టులు అమెరికా రాజకీయ విధాన స్వరూపాలను పునర్నిర్వచించే బలమైన రాజకీయ శక్తిగా ఆవిర్భవించనున్నారా? డెమోక్రాట్ల ప్రైమరీస్ ఎన్నికలలో నమోదవుతున్న కొన్ని విజయాలు ఈ ప్రశ్నలు రేపుతున్నాయి. ఈ ఎన్నికల్లో డెమోక్రటిక్ సోషలిస్టులు గెలుస్తున్నారు. వారి గళం కొత్త నినాదాలను లేవనెత్తుతున్నది. ఆ స్వరాల సంఖ్య ప్రస్తుతానికి పరిమితమే కానీ, తమ వాదనల ద్వారా వారు సంప్రదాయ డెమోక్రాట్లలో కూడా మద్దతును కూడగట్టుకుంటున్నారు.మిషిగన్‌లో ప్రైమరీస్ ఎన్నికలలో అబ్దుల్ ఎల్ సయీద్ విజయం ఇందుకు తాజా ఉదాహరణ. డెమోక్రాట్ సోషలిస్ట్ అయిన సయీద్ అయిదుసార్లు కాంగ్రెస్ ఉమన్‌గా ఉన్న హేలీ స్టీవెన్స్‌ను స్వల్ప మెజారిటీతో ఓడించారు. డిస్ట్రిక్ట్ ప్రైమరీస్‌లో ఠాణేదార్‌ను డెమోక్రాట్ సోషలిస్టు డొనావన్ మెకిన్నీ ఓడించారు. అలాగే తాజా విజయాలు నమోదు చేసిన రషిదా త్లయిబ్, క్రిస్ గ్లిమర్ హిల్‌లు కూడా డెమోక్రటిక్ సోషలిస్టులే. ఈ విజయాలన్నీ డెమోక్రాట్లలో సోషలిస్టుల ఆధిపత్యం**




**పెరుగుతోందన్న వాదనకు కొనసాగింపు మాత్రమే. న్యూయార్క్ సిటీ మేయర్ జొహ్రాన్ మందానీ వీరిలో ప్రముఖుడు. డెమోక్రాట్ సోషలిస్టుల భావజాలంతో కూడిన ప్రకటనలతో తరచూ వార్తల్లో నిలుస్తున్న వ్యక్తి కూడా.**

అమెరికాను మరింత సోషలిజం వైపు తీసుకెళ్లాలనే వాదన డెమోక్రాట్లలో పెరుగుతోంది. ప్రైవేట్ హెల్త్ కేర్ రంగాన్ని సమూలంగా తొలగించడం, పోలీసులకు నిధులను తగ్గించడం వంటివి వీరు ప్రధానంగా తెరమీదకు తెస్తున్నారు. సొంత ఇంటి కల కోసం తాకట్టులు పెట్టాల్సిన పరిస్థితి ఉండదనే ప్రజాకర్షక ప్రకటనలతో వీరు ముందుకు వస్తున్నారు. అంతేకాదు, సెనేట్, ప్రెసిడెన్సీ, సుప్రీంకోర్టు వ్యవస్థలలో కూడా భారీ మార్పులు రావాలని వీరు డిమాండ్ చేస్తున్నారు.

సాధారణంగా అమెరికాలో రాజకీయ నాయకుల మాటలు, ప్రకటనలు, వాగ్దానాలు రెండు రకాలు. ప్రజల్లోంచి ఎన్నికవడానికి పార్టీ అభ్యర్థిగా వచ్చినప్పుడు ఒకరకమైన వాగ్దానాలు ఉంటాయి. పార్టీ అభ్యర్థిగా ఎంపికవడానికి ప్రైమరీస్ ఎన్నికల్లో పోటీచేసినప్పుడు ఆ మాటలు మరో రకంగా ఉంటాయి. సాధారణ ఎన్నికలంటే అన్ని వర్గాల, భిన్న ఆలోచనా ధోరణులకు చెందిన ప్రజల ఓట్లను రాబట్టేలా మాటలు ఉండాలి. కానీ ప్రైమరీస్ అలా కాదు. ప్రైమరీస్ ఎన్నికల్లో తమ పార్టీ కార్యకర్తలను ఆకట్టుకోవడమే ప్రధానం. పార్టీలో ఇంచుమించుగా తమ భావజాలానికి చెందినవారే కార్యకర్తలుగా ఉంటారు. కాబట్టి సారూప్యత ఉన్న తమ భావజాలంలోనే, కొన్ని అతివాద ధోరణులను ప్రదర్శించడం ద్వారా వారిని ఆకట్టుకోవాలి. డెమోక్రాట్ సోషలిస్టులు చేస్తున్నది అదే. 'మరింత సోషలిజం-మరింత సమానత్వం' దిశగా తమ ఎజెండాను ప్రాజెక్ట్ చేస్తూ డెమోక్రాట్ పార్టీ ప్రైమరీస్‌లో వీరు నెగ్గుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో సమూల మార్పులు తేవడం, పని అవసరం తక్కువ చేయడం, జరిమానాలు, అప్పులు, తాకట్టులు లేని సమాజం, అందరికీ సమానమైన- ప్రభుత్వపరమైన ఆరోగ్యభద్రత లాంటివి వీరి ఎజెండా అంశాలు. డెమోక్రాటిక్ సోషలిస్టులు వ్యాప్తిచేస్తున్న భావజాలంలో, యుద్ధాలు లేని సమాజం, జాతి లింగ వివక్షలను రూపుమాపడం వంటివీ ఉన్నాయి. ఇరాన్, క్యూబా, వెనెజువెలా వంటి దేశాలతో ఆంక్షలు లేని, నియంత్రణలు లేని సంబంధ బాంధవ్యాలు కావాలనే డిమాండ్ కూడా ఉంది.

ఈ పరిణామాలను విశ్లేషకులు బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్న రోజుల్లో రిపబ్లికన్ పార్టీలో మొదలైన టీపార్టీ ఉద్యమంతో పోలుస్తున్నారు. అప్పట్లో ఒబామా పాలన నాటి హెల్త్ కేర్ సంస్కరణలు, ప్రభుత్వ వ్యయాలు, పన్నుల విధానాలను కొందరు కన్జర్వేటివ్ నాయకులు వ్యతిరేకించారు. వారు నిరసనలతో ఆగలేదు. తమ బలమైన వ్యతిరేకతతో ఏకీభవించే వారినే రిపబ్లికన్ ప్రైమరీస్‌లో పోటీచేయించారు. ఆ పార్టీలో అప్పటికే గుర్తింపు పొందిన అభ్యర్థి కంటే, మరింత కన్జర్వేటివ్ ఆలోచనలున్న అభ్యర్థులకే ఈ టీపార్టీ ఉద్యమకారుల అండ లభించింది. 'డెమోక్రాట్లను ఓడించడం మాత్రమే కాదు, రిపబ్లికన్ పార్టీ గమనాన్ని కూడా మరింత కన్జర్వేటివ్‌గా పునర్నిర్దేశిస్తాం' అన్నట్టుగా వారి ధోరణి సాగింది. వీరు 63 సీట్లు గెలిచి రిపబ్లికన్ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్ నియంత్రణ మొత్తాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు. సెనేట్‌లో 6 సీట్లు గెలిచినా మెజారిటీ దక్కలేదు. అప్పటివరకు ఉదారవాద- కన్జర్వేటివ్ భావజాలాల మిశ్రమంగా ఉన్న రిపబ్లికన్ పార్టీ ఎక్కువ కన్జర్వేటివ్‌గా మారింది. టీపార్టీ ఉద్యమం ద్వారా బలపడిన కన్జర్వేటివ్ వాదులు రిపబ్లికన్ పార్టీలో క్రమంగా ఆధిపత్యం సాధించిన తీరు, ఇప్పటి డెమోక్రటిక్ పార్టీలో సోషలిస్టుల ప్రాబల్యం పెరుగుతుండడానికి దగ్గరగా ఉంది. ఈ క్రమంలో డెమోక్రటిక్ పార్టీ అతివాద సోషలిస్టుల చేతిలోకి పూర్తిగా వెళ్లిపోతే గనుక, అమెరికా భవిష్యత్ రాజకీయ విధానాల్లోనే భారీ కుదుపు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఈ సోషలిస్టు ఎజెండాను అమెరికా పౌరసమాజం ఎలా స్వీకరిస్తుందో చూడాలి.

# సంస్కృతికి సిరిగంధపు పూత చేనేత!

**చీరలెన్నో పేర్లు అన్ని! వాసం అంటే చీర. దానికే కోక, వరాసి, కార్పాసము... ఇలా ఎన్నో మారుపేర్లు. కౌశేయం అంటే- ప్రధానంగా పట్టుచీర. క్షౌమమంటే- నారచీర. వనవాసానికి పోతున్న రాముడికి- 'మంధర జాగ్రత్త పెట్టినట్టి నారచీర'లను తెచ్చి చేతికిచ్చింది కైక. రాముడెలాగో చుట్టబెట్టుకున్నాడు కానీ, కంకంటి పాపరాజు మాటల్లో 'రంగారు బంగారు చెంగావులు ధరించే' జనక మహీపతి కూతురు కదా! సీతకు కట్టుకోవడం చేతకాలేదు. రాముడే 'తానుగా కదియుచు పట్టుచీరపయి కట్టెను సీతకు నారచీరలన్' అన్నారు కల్పవృక్షంలో విశ్వనాథ. ఆ ముతకచీరలను చూస్తూనే, అరుంధతికి కోపం వచ్చింది. 'తూకము అయిదుమళ్లు, తొమ్మిది మూరల నారచీర కట్టినావె సీతకు! ఆమె మోయలేదు, అందు మున్గియపోవు, కాళ్లకు అడ్డము పడి కదలలేదు' అని కన్నీళ్లు పెట్టుకుందట! ఆ బరువెంతో తెలిస్తే తప్ప, 'పదహారు మడతల సిందూర వర్ణపు చీరెను అగ్గిపెట్టెలో**



**ఎగుమతి చేసిన ఖ్యాతి తనది' అంటూ సిరిసిల్ల ఘన చరిత్రను వర్ణించిన కవి వంశీకృష్ణ ఆవేదన అర్థం కాదు. ఆత్రేయ చెప్పిన- గాలిలోన తేలిపోయే జిలుగువెలుగుల 'చీరశిల్పం' గొప్పదనం తెలియదు.**

తయారీ సంగతి సరే, చీర కట్టుకోవడం చాలా సొగసైన కళ. పట్టుచీర కట్టుబడి మరీను. బుటా అందం, కొంగు జరీ కళ్లకు కట్టేలా పట్టుచీరను కట్టుకోవడం అందరికీ పట్టుబడే విద్యకాదు. 'పట్టుచీర కట్టుకున్న పుత్తడిబొమ్మ! నీ కట్టుబడికి తరించింది పట్టుపురుగు జన్మ' అని ఊరికే అనలేదు మరి వేటూరి! ఆ ఒడుపు తెలిసిన అతివ నేవళీకంగా చీరకట్టి, వెడల్పు అంచును కాలిబొటనవేళ్లతో విలాసంగా ఎగరేస్తూ ఎదురొస్తే నడిచొస్తున్న శ్రావణ లక్ష్మిలా తోస్తుంది. అందుకే చీరలంటే స్త్రీలందరూ అంతగా ఇష్టపడతారు. బీరువా తెరవగానే కాళ్లమీద పడిపోయేటన్ని తెచ్చి, మధ్యలో కలరా ఉండలు ఉంచి దాచిపెడతారు. చీర భారతదేశ సాంస్కృతిక విశేషం. చరిత్రకు ప్రతీక. సంప్రదాయ సూచిక. 'నేనొక ప్రత్యేకమైనదాన్ని' అనే గర్వ వీచికను స్త్రీలో రేకెత్తించే అద్భుత మంత్రదండమది! చీర స్త్రీలకు సౌభాగ్య సౌందర్య చిహ్నం! దాని కొంగుమాటున దాగే వారందరూ "తల్లి చాటు బిడ్డలే!"

పుట్టిననాటినుంచీ అడవుల్లోనూ, మునులతోనూ గడిపిన ఋష్యశృంగుణ్ని తమదేశానికి తీసుకెళ్దామని వచ్చారు విలాసినులు. 'ఇవి అపూర్వంబులైన వల్కలములు (చీరలు) అనుచు వారి పట్టు పుట్టంబులను' పదేపదే తాకుతూ ఆనందపడిన ఆయన అమాయకత్వాన్ని రామాభ్యుదయంలో అయ్యలరాజు రామభద్రుడు వర్ణించాడు. అంటే, ఆ స్త్రీల ఆకర్షణ సైతం ఆ చీరల అందం ముందు వెలవెలబోయిందని! కొనే ముందు స్త్రీలంతా గమనించాల్సిందేమంటే చీరవల్ల తమలో ఆత్మవిశ్వాసం పెరగాలి. కట్టిన తీరువల్ల చీరకు అందం రావాలి. ప్రతిచీర స్త్రీ మనోభావాన్ని, అభిరుచిని ప్రతిబింబించాలి. ఆమె హృదయాన్ని అలా లోకానికి ఆవిష్కరించే చేనేత కార్మికుల జీవితాలు మటుకు శిథిలమైపోతూండటం విషాదకరం. '22 అంగుళాల జీవితాకాశం మీద నేసిన నూతన వస్త్రాన్ని వెన్నెల చాపంలా ఆరెయ్యడం' తెలియని బడుగు బతుకులే అయినా, కళాకౌశలం మాత్రం ఎన్నటికీ వన్నె తగ్గదని సిరిసిల్లకు చెందిన వెల్ది హరిప్రసాద్ నిరూపించారు. 5.5 మీటర్ల చీరను కేవలం రెండున్నర గంటల్లో నేసి ఒక అగ్గిపెట్టెలో ఇమిడ్చారాయన. 'మానవుడే మహనీయుడు' అని ఊరికే అన్నారా ఆరుద్ర!

# స్వతంత్ర విధానమే ప్రగతి మార్గం

**మన దేశంలో సమస్యలు సృష్టించడానికి పాకిస్థాన్ ఒకవైపు నిరంతరం కుట్రలు పన్నుతోంది. భారతదేశం ఒక ప్రధాన శక్తిగా ఎదగకుండా, తనను దక్షిణాసియాకే పరిమితం చేయాలని చైనా మరోవైపు ప్రయత్నిస్తోంది. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మయన్మార్ వంటి దేశాల్లో రాజకీయ మార్పుల వల్ల మన పొరుగున అస్థిరత కొనసాగుతోంది. ఇన్ని అనిశ్చితుల మధ్య కూడా ఇండియా ఎనిమిది దశాబ్దాలుగా అంతర్జాతీయ వేదికపై తన కార్యనిర్వహణ స్వేచ్ఛను కాపాడుకుంటూ వస్తోంది. ఏ ప్రధాన శక్తిపై ఆధారపడకుండా స్వతంత్ర విధానాన్ని అనుసరిస్తోంది.**



భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చేనాటికి అమెరికా నేతృత్వంలోని పెట్టుబడిదారీ కూటమి ఒకవైపు, సోవియట్ యూనియన్ సారథ్యంలోని కమ్యూనిస్ట్ కూటమి మరొకవైపు మోహరించి ఉన్నాయి. భారతదేశం ఈ రెండింటిలో ఏదో ఒక కూటమిని ఎన్నుకుని, ప్రచ్ఛన్న యుద్ధ రాజకీయాల్లో పాల్గొంటుందనే అంచనా ఉండేది. కానీ, పెద్ద దేశాల ఒత్తిళ్లకు తలవంచకుండా, భారత్ అలీన విధానాన్ని అనుసరించింది. మన భౌగోళిక, రాజకీయ, ఆర్థిక అవసరాలకు అలీన విధానమే అత్యుత్తమమైనది. శతాబ్దాలపాటు వలస పాలనలో మగ్గిన భారతదేశం, స్వతంత్రమయ్యే సమయానికి ఆర్థికంగా నిరుపేదగా, సాంకేతికంగా వెనకబడిన దేశంగా ఉండేది. ఈ పరిస్థితిలో ఇతరుల గొడవల్లో తలదూర్చకుండా తన ఆర్థికాభివృద్ధికే ప్రాధాన్యమివ్వాలని భారత్ భావించింది. అందుకే సైద్ధాంతిక భేదాలతో నిమిత్తం లేకుండా ఇతర దేశాలతో ఆర్థిక, సాంకేతిక బంధాలను బలోపేతం చేసుకుంది. ఉదాహరణకు, భిలాయ్ ఉక్కు కర్మాగారాన్ని సోవియట్ సహకారంతో నిర్మించారు. రూర్కెలా, దుర్గాపూర్ ఉక్కు కర్మాగారాలను పశ్చిమ జర్మనీ, బ్రిటన్‌ల సాయంతో ఏర్పాటుచేశారు. మద్రాస్, కాన్పూర్ ఐఐటీలకు పశ్చిమ జర్మనీ, అమెరికాలు మద్దతు ఇవ్వగా బొంబాయి ఐఐటీ ఏర్పాటుకు సోవియట్ సహకరించింది. భారతదేశ అలీన విధానం ఇలాంటి విభిన్న ఆర్థిక, సాంకేతిక భాగస్వామ్యాలను సుసాధ్యం చేసింది. రక్షణకు ఆయుధాలను సోవియట్ నుంచే కాకుండా ఫ్రాన్స్, బ్రిటన్ తదితర ఐరోపా దేశాల నుంచి కూడా భారత్ కొనుగోలు చేసింది.

**అందరి బంధువయా...**

అమెరికా నేతృత్వంలోని సైనిక కూటమిలో పాకిస్థాన్ చేరిన తర్వాత, అలీన విధానాన్ని అనుసరించడం భారత్‌కు ముళ్లబాటగా మారింది. మరోవైపు, చైనాతో సరిహద్దు వివాదం ఏర్పడి 1962లో యుద్ధం జరిగింది. ఆ తర్వాత భారత్‌కు వ్యతిరేకంగా చైనా పాక్ సహకారం ఊపందుకుంది. ఇది చాలదన్నట్లు సోవియట్ పట్ల ఉమ్మడి ఆందోళన వల్ల అమెరికా, చైనాలు దగ్గరయ్యాయి. మారుతున్న పరిణామాల మధ్య పాకిస్థాన్‌తో 1971 యుద్ధానికి ముందు భారతదేశం సోవియట్‌తో శాంతి, స్నేహ, సహకార ఒప్పందంపై సంతకం చేసింది. ఇది భారత అలీన విధానాన్ని దెబ్బతీసిందని విమర్శలు వచ్చాయి. అయితే, ఇండోసోవియట్ ఒప్పంద పరిధి చాలా పరిమితమైనది. భారత భూభాగంలో సోవియట్ సైనిక స్థావరాన్ని నెలకొల్పడానికి కానీ, ఆ దేశ సైనిక సిబ్బంది ఇక్కడి నుంచి పనిచేయడానికి కానీ ఎన్నడూ అనుమతించలేదు.

బెర్లిన్ గోడ కూలిపోవడం, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం కావడంతో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసింది. సైద్ధాంతిక సంఘర్షణ ముగియడంతో, భారతదేశం అలీన విధానం నుంచి వ్యూహపరంగా స్వయంప్రతిపత్తికి మళ్లింది. మునుపటి అలీన విధానానికి, ప్రస్తుత వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి విధానానికి మధ్య కొన్ని పోలికలు, తేడాలు ఉన్నాయి. భారతదేశం ఏ కూటమిలోనూ చేరడానికి నిరాకరిస్తూనే, ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రముఖ దేశాలతో సన్నిహిత సంబంధాలను ఏర్పరచుకుంటోంది. భారతదేశం అమెరికాతోనే కాకుండా ఆగ్నేయ, తూర్పు ఆసియాలతోనూ ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసుకుంది. చైనా ఆర్థిక విజృంభణ, ప్రాదేశిక దూకుడు వల్ల అమెరికాతో చేతులు కలపాలని సూచనలు వచ్చినా, భారతదేశం కూటమి రాజకీయాలకు దూరంగానే ఉంది. ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాలతో కలిసి 'క్వాడ్'లో చేరినప్పటికీ, దానికి సమాంతరంగా 'బ్రిక్స్' (బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) సంఘంలోనూ చేరింది. భారతదేశానికి నేడు జపాన్, రష్యా, అమెరికాలతోపాటు యూరప్, ఆసియాల్లోని అనేక ఇతర దేశాలతో బలమైన ఆర్థిక, వాణిజ్య భాగస్వామ్య బంధాలు ఉన్నాయి.

తాజాగా భారతదేశ పశ్చిమ సరిహద్దుల వెంబడి కొత్త కూటమి రూపుదిద్దుకుంటోంది. పాకిస్థాన్, సౌదీ అరేబియా, తుర్కియేలు కొన్ని రోజుల క్రితం సంయుక్త రక్షణ ఒప్పందంపై సంతకం చేశాయి. తమ మూడు దేశాలలో ఎవరిపై దాడి జరిగినా, అది మిగిలినవారిపైనా దాడిగా భావిస్తామని ఈ ఒప్పందం పేర్కొంటోంది. పాకిస్థాన్, భారత్‌ల మధ్య సంఘర్షణ వాతావరణం ఉన్నందున, ఈ ఒప్పందం భారత ప్రయోజనాలను దెబ్బతీస్తుందనే ఆందోళన పెరుగుతోంది. ఇప్పటికే భారత్‌పై పలు ఉగ్రదాడులను ప్రేరేపించిన పాకిస్థాన్ రేపోమాపో మళ్లీ దాడికి తెగబడి, భారత్ దానికి సైనికంగా స్పందిస్తే తుర్కియే కానీ, సౌదీ కానీ పాక్‌కు అండగా పోరులో దిగుతాయా అన్నది కీలక ప్రశ్న. అయితే ఆ మూడు దేశాల అవసరాలు, ఆందోళనలు పరస్పరం భిన్నమైనవి. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్‌కు పెరుగుతున్న బలం గురించి తుర్కియే కలవరపడుతోంది. సౌదీ ఏమో ఇరాన్ గురించి ఆందోళన చెందుతోంది. ఇక పాకిస్థాన్.. భారతదేశ సైనిక, ఆర్థిక పటిమను చూసి భయపడుతోంది. ఇలా ఎవరి భయాలు వారికి ఉన్నప్పుడు ఉమ్మడి సైనిక చర్య చేపట్టడం తేలిక కాదు. ఏదిఏమైనా, ఈ సైనిక కూటమి రాజకీయాలపై భారత్ అప్రమత్తంగా ఉండకతప్పదు. పాకిస్థాన్ కన్నా భారతదేశం ఆర్థికంగా, రాజకీయంగా చాలా బలమైనది. ఒమన్, యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, బహ్రెయిన్, కువైట్, ఈజిప్ట్ తదితర దేశాలతో బలమైన ఆర్థిక సంబంధాలను కలిగి ఉంది. ఇజ్రాయెల్‌తోనైతే పటిష్ఠ రక్షణ, సాంకేతిక భాగస్వామ్యాలను నెరపుతోంది. పశ్చిమాసియా దేశాల్లో పెద్ద సంఖ్యలో భారత సంతతి ప్రజలు నివసిస్తున్నారు. వీటన్నిటి దృష్ట్యా భారత్ అన్ని దేశాలతో సన్నిహిత సంబంధాలను నెరపడం ద్వారా తన వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని కొనసాగించగలదు. తద్వారా పెరుగుతున్న కూటమి రాజకీయాల ప్రతికూల ప్రభావాన్ని తగ్గించగలదు.

## ఖాద్రి వాకర్ అసోసియేషన్ తొలి కార్యవర్గం ఎన్నిక



**కదిరి ఆగస్టు24 (అనంత జనశక్తి న్యూస్):-**

కదిరిలో పది సంవత్సరాలనుండి నిర్వహిస్తున్న ఖాద్రి వాకర్స్ అసోసియేషన్ కు 11826 తేదీన 129/2026నంబరతో హిందూపూర్ సబ్ రిజిస్టర్ ఖాద్రి వాకర్స్ అసోసియేషన్ ను రిజిస్టర్ సొసైటీగా సర్టిఫై చెయ్యడమైంది.అందులో భాగంగా ఈరోజు కదిరి పట్టణము ఎంజి రోడ్ లోని కన్యాకాపరమేశ్వరి ధ్యాన మందిరంలో ఖాద్రి వాకర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గము ప్రామాణ స్వీకరం చెయ్యడం జరిగినది.

గౌరవఅధ్యక్షులుగా డాక్టర్ ప్రసాద్,ప్రసిడెంట్ డాక్టర్ శ్రీనివాసులు. వైస్ ప్రసిడెంట్ గా డాక్టర్ విద్యాసాగర్. సెక్రటరీగా హెడ్మాస్టర్ భాస్కర్, జాయింట్ సెక్రటరీగా లాయర్ పిడిగు రవీంద్రబాబు ప్రమాణ స్వీకారం చెయ్యడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ప్రముఖ డాక్టర్ శంకరయ్య, డాక్టర్ మదన్ కుమార్ , డాక్టర్ మధుసూదన్ రెడ్డి తో పాటు టీచర్స్ పాల్గొని విజయవంతం చేసారు.

## జ్ఞానజ్యోతి తర్డ్ ఫేస్ అవగాహన సదస్సు



**ప్రభుత్వ జడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలో**

**ఆమడగూరు ఆగస్టు 24: ( అనంత జనశక్తి న్యూస్)**

అమడగూరు మండల కేంద్రంలోని స్థానిక జడ్పీహెచ్ఎస్ స్కూల్ లో,నందు జరిగినటువంటి,విద్యాశాఖ మరియు శిశు సంక్షేమ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమడగూరు మండల అంగన్వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి 3 రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా ఐసీడ్స్ ప్రాజెక్ట్ పుట్టపర్తి సీడీపీఓ రెడ్డి రమణమ్మ హాజరు అయినారు. ఈ సందర్బంగా సీడీపీఓ గారు మాట్లాడుతూ ఫ్లన్ ఫండేషనల్ లీటరసీ అండ్ నూమెరేసీ 120 డేస్ లో భాగంగా ఈ 3 రోజుల శిక్షణ అంగన్వాడీ కార్యకర్తలకు నిర్వహించడం జరుగుతుంది అని, ఈ శిక్షణ లో అంగన్వాడీ కార్యకర్తలు ప్రారంభ తరగతులలో ఆటల ఆధారిత అభ్యసన,పిల్లల అభ్యసన లో తల్లిదండ్రులు మరియు సమాజ భాగస్వామ్యం,ప్రారంభ సంవత్సరాలలో అంచనాలు,అంగన్వాడీ కేంద్రాలలో సమ్మిళిత పద్ధతులు మరియు సంరక్షణ అనే అంశాల గురించి నేర్చుకుంటారు అని తెలిపారు. ఐసీడీస్ కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్వాడీ స్థాయి నుండే పిల్లలకు మంచి పునాది వేసినట్టు అయితే భవిష్యత్తులో బడికి రాకుండా ఉండడాన్ని తగ్గించవచ్చు అని, పిల్లలు మంచి తెలివితేటలు కలిగి చదువులో రాణిస్తారు అని తెలిపారు. ఈ ట్రైనింగ్ ని ఉపయోగించుకుని అంగన్వాడీ కార్యకర్తలు తమ యొక్క నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని పిల్లలు సమగ్ర అభివృద్ధి కి పునాది వేయాలని కోరినారు. ఈ కార్యక్రమం లో ఐసిడిఎస్, సూపర్వైజర్,గంగాదేవి , డిఆర్పి, ట్రైనింగ్,ఉపాధ్యాయులు ధనుంజయ, చంద్రమోహన్ శ్రీనివాసులు, మండల స్థాయి అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ రమాదేవికి గజమాలతో సత్కారం



**అనంతపురం, ఆగస్టు 24 :అనంత జనశక్తి న్యూస్**

గవర్నర్ కోటాలో నూతనంగా ఎమ్మెల్సీగా ఎంపికైన దలవాయి రమాదేవి, ఆమె భర్త దలవాయి వెంకటనారాయణలను 9వ క్లస్టర్ ఇన్‌ఛార్జ్ కృష్ణం రఘు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరోసారి బీసీల పక్షపాతి తెలుగుదేశం పార్టీ అని నిరూపించిందన్నారు. మొదటి నుంచి మహిళలను పార్టీ రాజకీయంగా ప్రోత్సహిస్తోందన్నారు. ముఖ్యంగా సీఎం చంద్రబాబు మహిళల ప్రాతినిథ్యం ఎక్కువగా ఉండేలా చూస్తున్నారన్నారు. అలాగే బీసీలకు అత్యధిక అవకాశాలు కల్పించింది కూడా చంద్రబాబేనన్నారు. సామాన్య క్లస్టర్ ఇన్‌ఛార్జిగా ఉన్న మహిళకు, అట్టడుగు వర్గానికి చెందిన వడ్డెర కులానికి ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వడం పట్ల ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో 5వ డివిజన్ నాయకులు, బూత్ కన్వీనర్లు, య□నిట్ ఇన్‌ఛార్జ్ మారుతీప్రసాద్, కో క్లష్టర్ చంద్రమౌళి, ఆటో య□నియన్ నాయకులు లక్ష్మీనారాయణ, గంపాల్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు కార్పొరేట్ వైద్యమే లక్ష్యం

- 44వ డివిజన్‌లో ఘనంగా నారాయణ ఉచిత వైద్య శిబిరం
- 3 కోట్ల ఆన్ వీల్స్ వాహనంతో ఉచిత సేవలు
- మహబూబ్ ఖాన్ పార్కు వద్ద ఉచిత వైద్య శిబిరం ప్రారంభం
- నెల్లూరు ప్రజలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయిలో కంటి, దంత వైద్య సేవలు

**నెల్లూరు ఆగస్ట్ 24, అనంత జనశక్తి న్యూస్**



నెల్లూరు ప్రజలకు కార్పొరేట్ ఉచిత వైద్యాన్ని దరి చేరుస్తూ 44వ డివిజన్‌లో బృహత్తర వైద్య శిబిరం సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది.. కలెక్టర్ ఆఫీస్ సమీపంలోని మహబూబ్ ఖాన్ పార్కు వద్ద మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాల మేరకు నారాయణ నేత్రజ్యోతి, నారాయణ దంత సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.నారాయణ ఆసుపత్రి కంటి విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ సుధ, స్థానిక నాయకురాలు పార్టీ కార్యకర్తలు పాల్గొని ప్రజలకు వైద్య సేవలను అందించారు.. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి నగర మహిళా అధ్యక్షురాలు కప్పిర రేవతి పాల్గొన్నారు..నెల్లూరు నగరంతో పాటు రూరల్ ప్రాంతాల్లోని పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి ఉచిత వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా ఈ శిబిరాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నట్లు కప్పిర రేవతి, డాక్టర్ సుధ తెలిపారు. 44వ డివిజన్‌లో ఈ తరహా శిబిరాన్ని నిర్వహించడం ఇది మూడోసారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ వైద్యం అందుతుందన్నారు. దీనికి తోడు నారాయణ మాతృసేవ పథకం ద్వారా గర్భిణులకు ఉచిత సురక్షిత ప్రసవాలు అందించి చీరసారెలతో కూడిన ప్రత్యేక కిట్లను కూడా అందజేస్తున్నట్లు వివరించారు... ఇప్పటివరకు ఈ పథకాల ద్వారా 11,900మందికి పైగా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, 7,000 మందికి పైగా నాణ్యమైన కంటి అద్దాలను ఉచితంగా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. క్యాటరాక్ట్ శస్త్రచికిత్సలు, గ్లాకోమా, డయాబెటిక్ రెటినోపతి మరియు తీవ్రమైన దంత సమస్యలు ఉన్నవారిని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి రిఫర్ చేసి ఉచితంగా చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఈ రోజువారీ శిబిరాల కోసం అన్ని రకాల అధునాతన వైద్య పరికరాలు కలిగిన 3 కోట్ల విలువైన నారాయణ ఆన్ వీల్స్ అందుబాటులో ఉంచామని, స్థానిక ప్రజలందరూ ఈ వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు .ఈ కార్యాలయంలో క్లస్టర్ ఇంచార్జ్ పిట్టి నాగేశ్వర రావు ,డివిజన్ ప్రెసిడెంట్ ఏడుకొండలు, ఆర్గనైజింగ్ సెక్రటరీ అశోక్, పార్లమెంట్ అధికార ప్రతినిధి దర్శి హరికృష్ణ, జనరల్ సెక్రెటరీ పాలూరు బ్రహ్మం,కారంశెట్టి మహేష్, వెంకటరమణ,రమేష్ బాబు, స్థానిక టిడిపి నేతలు నాయకులు తదితరులు పాల్గొన్నారు .

# సిఏ కోర్స్ పై అవగాహన సదస్సు..

**- చైర్మన్ అరవింద్ రామ.**

**ధర్మవరం ఫిబ్రవరి 24, అనంత జనశక్తి న్యూస్:**



పట్టణంలోని బత్తలపల్లి రోడ్డు పోలా ఫంక్షన్ హాల్ లో మెగా కెరియర్ కౌన్సిలింగ్ ప్రోగ్రాం.. సిఏ కోర్స్ లపై అవగాహన సదస్సును చైర్మన్ అరవింద్ రామ, కార్యదర్శి రశ్మి ఐనాపూర్, కోశాధికారి రాకేష్ గుప్తా, మరొక చైర్మన్ వినోద్, ఈసీ మెంబర్ అండ్ ఇమీడియట్ ఫాస్ట్ చైర్మన్ పని కుమార్ తో పాటు చార్టెడ్ అకౌంటెంట్స్ పోలా రామకృష్ణ, పోష లోకేష్ కుమార్, లక్ష్మి చెన్నకేశవ, ప్రభాకర్ రెడ్డి పాల్గొని ఈ అవగాహన సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశమును ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేశారు. ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి గోపాల్ నాయక్ కూడా పాల్గొన్నారు. అనంతరం ప్రముఖులు, ఎంఈఓ గోపాల్ నాయక్ మాట్లాడుతూ.... వివిధ ప్రాంతాల నుండి 12 ప్రభుత్వ పాఠశాలలు, మూడు ప్రైవేట్ పాఠశాలలు, ఆరు కళాశాలలకు చెందిన సుమారు 1,200 మంది విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొని మంచి స్ఫూర్తిని పొందడం జరిగిందని తెలిపారు. ఈ సదస్సులో సిఏ కోర్స్ యొక్క ప్రాముఖ్యత విద్యార్థులు తమ పదవ తరగతి ఇంటర్మీడియట్ తర్వాత ఈ కోర్సులు ఎందుకు ఎంచుకోవాలి అన్న విషయాన్ని తెలియజేయడం జరిగిందన్నారు. పరీక్షా విధానం ఫీజుల వివరాలు స్కాలర్షిప్లు, భవిష్యత్తులో లభించే అద్భుతమైన ఉపాధి అవకాశాలు గూర్చి నిపుణులుగా సమగ్రంగా వివరించడం జరిగిందని తెలిపారు. దేశంలోనే అత్యున్నతమైన మరియు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఈ వృత్తి విద్య ద్వారా విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును ఎలా తీర్చుకోవచ్చో అన్న వాటిపై కూడా పూర్తి వివరణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ అవగాహన సదస్సులో కోర్సు నిర్మాణం, ప్రవేశ మార్గాలు, అద్భుతమైన ఉపాధి అవకాశాలు, ఫీజులు, స్కాలర్షిప్లు, ఎర్న్ వైల్ యు లెర్న్ అన్న వాటిపై వివరణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం కావడానికి అనంతపురం బ్రాంచ్ చైర్మన్ పాలకవర్గ సభ్యులు ప్రత్యేక కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని దేశ ఆర్థిక రక్షకులుగా ఎదగాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం పాల్గొన్న విద్యార్థులందరికీ కూడా పదేపదే కృతజ్ఞతలు తెలియజేశారు.

# మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురికి రూ.30 వేల జరిమానా



**పుట్టపర్తి రూరల్ ఆగష్టు 24**

**అనంత జన శక్తి న్యూస్.**

మద్యం సేవించి వాహనం నడిపిన ముగ్గురు వ్యక్తులకు 30, వేల జరిమానా విధించినట్లు పుట్టపర్తి పోలీసులు తెలిపారు.

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పుట్టపర్తి టౌన్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపడుతున్నారు.

మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడిపిన ముగ్గురు వ్యక్తులను పుట్టపర్తి టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసులు నమోదు చేసి సోమవారం పుట్టపర్తి మెజిస్ట్రేట్ న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. నిందితులు తమ తప్పును అంగీకరించడంతో, గౌరవ న్యాయస్థానం ముగ్గురికీ ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పన మొత్తం రూ.30,000 జరిమానా విధించిందనీ,

ఈ సందర్భంగా పుట్టపర్తి టౌన్ సీఐ యువరాజు మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మద్యం సేవించిన అనంతరం వాహనాలు నడపకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడే వారిపై పోలీస్ శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ యువరాజు హెచ్చరించారు.

# 50డివిజన్లు, 4పంచాయతీల్లో మా అభివృద్ధి కనిపిస్తోంది

- గత ఐదేళ్లలో మీరేం చేశారో చెప్పండి ఎమ్మెల్యే దగ్గుపాటి
- కమలానగర్ లో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం
- నగరాభివృద్ధిపై హర్షం వ్యక్తం చేసిన వ్యాపారులు
- త్వరలో 160 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభిస్తామన్న ఎమ్మెల్యే

**అనంతపురం ఆగస్ట్ 24, అనంత జనశక్తి న్యూస్**

రెండేళ్లలో మేము చేసిన అభివృద్ధి 50 డివిజన్లు, 4 పంచాయతీల్లో కనిపిస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. గత ఐదేళ్లలో వైసిపి నాయకులు ఏం చేశారో సమాధానం చెప్పాలన్నారు. నగరంలోని కమలా నగర్ లో ఆయన ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. డీసీఎంఎస్ కార్యాలయం వద్ద టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన కూటమి నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి రెండేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కమలా నగర్ లోని డిసిఎంఎస్ కొట్టాలు నందు ప్రజలతో మాట్లాడారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా రెండేళ్లలో నగరం అభివృద్ధి చెందుతోందని ప్రజలు, కమలానగర్ లోని వ్యాపారులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్లలో అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో 1296 కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. 250 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు వంటి మౌలిక వసతులు కల్పించమన్నారు. మరో 160 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తున్నట్లు వివరించారు. అనంతపురం నియోజకవర్గంలో ఇంటింటికి కూటమి ప్రభుత్వం కార్యక్రమం 85 శాతం పూర్తయిందన్నారు. మరోవైపు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ హామీలను అమలు చేసినట్టు వివరించారు. మొదటి ఐదు సంతకాల్లో పింఛన్లు పెంచమన్నారు. గతంలో వెయ్యి రూపాయలు పెంచేందుకు జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్లు పట్టిందన్నారు. కానీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక్క సంతకంతోనే పింఛన్లు పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారన్నారు. తల్లికి వందనం గతంలో ఇంట్లో ఎంతమంది ఉన్న అందరికీ ఇస్తామని చెప్పి జగన్ రెడ్డి మోసం చేశారన్నారు. ఇప్పుడు రికార్డు స్థాయిలో తల్లికి వందనం కింద సాయం చేస్తున్నట్లు వివరించారు. విద్యాశాఖలో మంత్రి లోకేష్ అనేక మార్పులు తీసుకురావడం వల్ల ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల నుంచి ప్రభుత్వ బడుల్లో విద్యార్థులు చేరుతున్నారన్నారు. కేవలం ఎన్టీఆర్, చంద్రబాబుకు మంచి పేరు వస్తుం [illegible] గి ముఖ్యమంత్రి చంద్రబాబు వాటిని తిరిగి తెరిపించి కేవలం ఐదు రూపాయలకే మూడు పూటలా భోజనం అందిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. రాయలసీమలో కూడా గతంలో ఎప్పుడు లేని విధంగా పారిశ్రామికాభివృద్ధి జరుగుతోందన్నారు. హార్టికల్చర్ హబ్ కోసం 40 వేల కోట్లు కేటాయించారని... పిపిపి మోడల్ లో మరో 60 వేల కోట్ల రూపాయలు తీసుకొస్తున్నారని చెప్పారు. ఒక అనంతపురం జిల్లాలోని లక్ష కోట్ల వరకు పెట్టుబడులు వచ్చాయన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కియా పరిశ్రమ తీసుకొచ్చారని గత ఐదేళ్లలో ఏ ఒక్క పరిశ్రమ కూడా అనంతపురం జిల్లాకు రాలేదని ఎమ్మెల్యే అన్నారు. పుట్టపర్తిలో 5వ జనరేషన్ కు చెందిన యుద్ధ విమానాలు తయారు చేసే పరిశ్రమలు కూడా వచ్చిందన్నారు. సిబిఎన్ బ్రాండ్ తో మంత్రి నారా లోకేష్ కృషి వలన ఇన్ని పెట్టుబడులు వస్తున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ వివరించారు.






# బాలల బీమా చెక్కులు పంపిణీ చేసిన జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్

**అనంతపురం, ఆగస్టు 24,**

**అనంత జనశక్తి న్యూస్**

అనంతపురం జిల్లా సమగ్ర శిక్ష, విద్యాశాఖఆధ్వర్యంలో బాలల భీమా పథకం ద్వారా మంజూరైన నగదును చెక్కు రూపంలో ఆయా విద్యార్థుల బాధిత కుటుంబాలకు జిల్లా జాయింట్ కలెక్టర్ సి .విష్ణు చరణ్ స్థానిక జిల్లా కలెక్టరేట్ లో సోమవారం ఉదయం అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ బాలల బీమా పథకం ద్వారా ఒక్కొక్క కుటుంబానికి రూ. 25000 చొప్పన అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రతి విద్యార్థి తల్లిదండ్రులు ఒక ఏడాదికి కేవలం రూ. 5 లు విద్యార్థి పేరు మీద బాలల బీమా పథకం చేయిస్తే వివిధ ప్రమాదాలు, పాముకాటు తదితర సంఘటనల్లో మృతి చెందిన విద్యార్థులకు ఈ ఇన్సూరెన్స్ పథకం వర్తిస్తుందని అందువల్ల 1 నుండి 10 తరగతి వరకు చదివే విద్యార్థులకు బాలల బీమా పథకం లో నమోదు చేయించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూచించారు. ప్రత్యేకంగా మన జిల్లాలో పేద ప్రజల కుటుంబాలకు ఈ పథకం ఉపయోగపడుతున్నట్లు తెలిపారు.

విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి....
అరుణ్ తేజ (8వ తరగతి) కొత్తకోట గ్రామం వజ్రకరూర్ మండలం, మణికంఠ చౌదరి (8 తరగతి) రాయలప్ప దొడ్డి బ్రహ్మసముద్రం మండలం, ప్రణయ్ (2 తరగతి ) శ్రీరంగపురం బెలుగుప్ప మండలం .
ఈ కార్యక్రమంలో సర్వ శిక్ష ఏపీసి శైలజ, డిఈ జయరాం సీఎమ్ఓ చంద్రశేఖర్, జి సి డి ఓ కవిత, ఎస్ ఏ ఉమ్మి సల్మా తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కి ఆహ్వానించిన

### తుక్కుగూడ మున్సిపల్ మాజీ చైర్మన్ కాంటేకార్ మధుమోహన్

మహేశ్వరం, ఆగస్టు 24, (అనంత జన శక్తి )

అంబోజి శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న శ్రీశ్రీ సూర్యగిరి రేణుక ఎల్లమ్మ బోనాలు ఘటం మహోత్సవ కార్యక్రమానికి కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ని ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.ఈ మేరకు తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ శ్రీ కాంటేకార్ మధుమోహన్ న్యూఢిల్లీలో హైదరాబాద్ లో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా కాంటేకార్ మధుమోహన్ మాట్లాడుతూ, ప్రతి ఏటా ఎంతో భక్తిశ్రద్ధలతో, వేలాది మంది భక్తుల సమక్షంలో సూర్యగిరి రేణుక ఎల్లమ్మ బోనాల ఉత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, ఈసారి ఉత్సవాన్ని మరింత పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగకు కేంద్ర మంత్రి హాజరై అమ్మవారి ఆశీస్సులు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.ఆహ్వానాన్ని స్వీకరించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సానుకూలంగా స్పందించారని, తేదీని బట్టి హాజరయ్యేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారని మధుమోహన్ తెలిపారు.ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అంబోజి శ్రీకాంత్ యాదవ్ కుటుంబ సభ్యులు, భక్తులు పాల్గొననున్నారు.

## మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతర కృషి



### - మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 24, (అనంత జన శక్తి )

ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్న మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి (కేవీఎల్ఆర్) ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా తనదైన ముద్ర వేస్తున్నారు.

మహేశ్వరం నియోజకవర్గంలోని పేద, మధ్యతరగతి కుటుంబాలు, విద్యార్థులు, యువత, మహిళలు, వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యంగా కేవీఎల్ఆర్ ముందుకు సాగుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వాటికి పరిష్కార మార్గాలు చూపించడం ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేస్తున్నారు.పదవి కంటే ప్రజా సేవే ముఖ్యమనే ఆలోచనతో, మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అనే సంకల్పంతో కేవీఎల్ఆర్ పని చేస్తున్నారని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి.మహేశ్వరం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా కేవీఎల్ఆర్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నాయి.

## మహేశ్వరంలో సీసీ రోడ్లకు శంకుస్థాపన

### 13 లక్షలతో అభివృద్ధి పనులు - వేగంగా పూర్తికి సర్పంచ్ ఆదేశం

మహేశ్వరం,ఆగస్టు 24, (అనంత జన శక్తి)

మహేశ్వరం గ్రామ పంచాయతీ పరిధిలో మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు వేగవంతంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం గ్రామంలో రెండు నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మునగపాటి నవీన్ , ఉప సర్పంచ్ జోరాల రమేష్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలతో కలిసి ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ పంచాయతీ సొంత నిధులు జిపిజిఫ్ కింద రూ. 8.00 లక్షలతో జోరాల పర్వతాలు ఇంటి నుండి బహదూర్ గూడెం సుధాకర్, ఇంటి వరకు ఒక సీసీ రోడ్డును, అలాగే విబిజిఆర్ఏఎంజి నిధుల కింద రూ. 5.00 లక్షలతో మిద్దింటి సుదర్శన్,ఇంటి నుండి బొమ్మనమైన అంజయ్య, ఇంటి వరకు మరో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మునగపాటి నవీన్, మాట్లాడుతూ, మన గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ పాలకవర్గం ముఖ్య ఉద్దేశమని అన్నారు. ప్రజలకు ఎలాంటి రవాణా ఇబ్బందులు లేకుండా నాణ్యమైన రోడ్లను అందించేందుకు కృషి చేస్తున్నామని, ఈ రెండు రోడ్లు పూర్తయితే గ్రామ ప్రజలకు రాకపోకలు సులభతరమవడంతో పాటు రోడ్లపై మురికి నీరు నిలవకుండా ఉండి సీజనల్ వ్యాధుల నుండి కూడా ఉపశమనం లభిస్తుందని తెలిపారు. రోడ్డు పనుల్లో నాణ్యత విషయంలో రాజీపడవద్దని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ కు సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు తింగిరికారి బేబీ, పోల్కం సునీత, ఆవులకాడి కిష్టమ్మ, స్వర్ణగంటి సంజీవ, మహమ్మద్ ఆజం, కడమోని స్వాతి, వత్తుల శాలిని, కాకి పరమేష్, దిద్దెల శ్రీశైలం, ఆకుల వీరిబాబు, సున్నం స్వప్నా, జటావత్ రుకేష్, రెవెళ్ళ చంద్రమౌళి, పంచాయతీ కార్యదర్శి సుజాత, మాజీ సర్పంచ్ స్వర్ణగంటి ఆనందం, నాయకులు కర్రోళ్ళ చంద్రయ్య, తింగిర్ కార్ మక్కాజీ, సున్నం కృష్ణ, మిద్దింటి బీరప్ప, బొమ్మనమైన అంజయ్య, తింగిర్ కార్ నరేందర్, మిద్దింటి సిద్ధార్థ, బొమ్మనమైన మహేష్ బాబు, మోతే కృష్ణ, ముచంతల శ్రీను, కాట్రవత్ రవి తదితరులు పాల్గొన్నారు.



## శిథిల స్థితిలో ఉన్న భవనంపై 60 అడుగుల సెల్ టవర్

### - గ్రీన్ కాలనీల్లో రేడియేషన్ ముప్పుపై ఆందోళన

సైనికపురి ఆగస్టు 24,అనంత జనశక్తి న్యూస్



మహానగరంలో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని సైనికపురి వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం 40 గజాల స్థలంలోనే బహుళ అంతస్తుల భవనాలు నిర్మించడం, మురుగు కాలువలు, నాళాలు, చెరువులు, కుంటలు, వంకలను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని వారు ఆరోపిస్తున్నారు. అనుమతులు లేని సెల్ టవర్లు, వాణిజ్య ప్రకటనల హోర్డింగులు, ప్లాస్టిక్ బ్యానర్లు, రహదారులకు అడ్డంగా ఏర్పాటు చేస్తున్న కటౌట్లపై మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు.సైనికపురిలోని సాయిబాబా ఆఫీసర్స్ కాలనీలో సుమారు 15 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన సెల్ టవర్ విషయంలో కూడా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. దాదాపు 35 సంవత్సరాల క్రితం నిర్మించిన పాత భవనంపై సుమారు 60 అడుగుల ఎత్తైన సెల్ టవర్‌ను ఏర్పాటు చేయడంతో భవనం భద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. టవర్, దాని పరికరాల బరువు పాత భవనంపై అదనపు భారాన్ని మోపుతోందని, భవనం ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో పలుమార్లు జీహెచ్ఎంసీ కాప్రా కార్యాలయానికి ఫిర్యాదు చేసినా తగిన చర్యలు తీసుకోలేదని వారు పేర్కొన్నారు.స్థానికుల ఆరోపణల ప్రకారం, ఈ సెల్ టవర్‌కు అవసరమైన అన్ని అనుమతులు లేవు. మొదట ఒకే సర్వీస్ ప్రొవైడర్ కోసం అనుమతి తీసుకుని, అనంతరం మరిన్ని సర్వీస్ ప్రొవైడర్లకు అనుకూలంగా టవర్‌ను అప్‌గ్రేడ్ చేసినట్లు వారు చెబుతున్నారు. మల్టిపుల్ సర్వీస్ ప్రొవైడర్, అంటే ఒకే టవర్‌ను పలువురు టెలికాం సంస్థలు ఉపయోగించే విధానం, అమలు చేసే ముందు సంబంధిత నిబంధనలు, అనుమతులు పాటించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొంటున్నారు.టవర్‌కు సంబంధించిన రేడియేషన్, అంటే రేడియో తరంగాల రూపంలో వెలువడే విద్యుదయస్కాంత శక్తి, విషయంలోనూ స్థానికుల్లో ఆందోళన నెలకొంది. సెల్ టవర్ల నుంచి వెలువడే రేడియో తరంగాలు ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయన్న భయాలు ప్రజల్లో ఉన్నాయని వారు తెలిపారు. అయితే ఇటువంటి ఆరోగ్య ప్రభావాలకు సంబంధించి శాస్త్రీయంగా నిర్ధారిత ఆధారాల ఆధారంగానే అధికారులు, నిపుణులు నిర్ణయాలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.పాత, బలహీనమైన భవనాలపై భారీ సెల్ టవర్లు ఏర్పాటు చేయడం మాత్రం ప్రజల భద్రతకు సంబంధించిన అంశమని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. భవనం నిర్మాణపరమైన భద్రత, అంటే అదనపు బరువును భరించే సామర్థ్యం, నిబంధనలకు అనుగుణంగా ఉందో లేదో అధికారులు తక్షణమే పరిశీలించాలని కోరుతున్నారు.అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన టవర్లపై సమగ్ర విచారణ జరిపి, అవసరమైతే వాటిని తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదం సంభవించిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే ప్రమాదాన్ని గుర్తించి నివారించడం ప్రభుత్వ, మున్సిపల్ అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు.సైనికపురి వంటి పచ్చని నివాస ప్రాంతాల్లో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పాత భవనాలపై ఏర్పాటు చేసిన భారీ సెల్ టవర్లను సాంకేతికంగా పరిశీలించాలని ఫెడరేషన్ ఆఫ్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్స్ గౌరవ అధ్యక్షుడు శ్రీ నాగేశ్వరరావు, అధ్యక్షుడు డా. ఎం. సురేష్ బాబు, కాలనీ వాసులు మనోహరరావు, డా. ఆశాదేవి, నిషా రాథోడ్, డా. అఖిల మిత్ర, సృజన, డా. సంఘమిత్ర తదితరులు అధికారులను కోరారు."ప్రమాదం జరిగిన తర్వాత బాధ్యత ఎవరిది అనే ప్రశ్న కంటే, ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం ముఖ్యం. పాత భవనాలపై ఉన్న భారీ సెల్ టవర్ల భద్రతపై అధికారులు తక్షణమే సమగ్ర తనిఖీ నిర్వహించాలి" అని వారు విజ్ఞప్తి చేశారు.

## ఏకలవ్య పాఠశాలలో సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

### - ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వెంటనే తొలగించాలి
### - అదనపు కలెక్టర్‌కు ఆదివాసీ సంఘాల వినతి

గుండాల, ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్:





గుండాల మండలం ముత్తాపురం గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థుల మధ్య వర్గ విభేదాలు, వివక్షకు కారణమయ్యారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గత పది రోజుల క్రితం పాఠశాలలో తీజ్ ఉత్సవాల పేరుతో ఆదివాసీ, బంజారా విద్యార్థుల మధ్య వివక్ష, వర్గ వైషమ్యాలు సృష్టించారని సంఘాల ప్రతినిధులు ఆరోపించారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మూడు రాంబాబు, వాంకుడోత్ రమేష్, మోహన్‌లాల్, పార్వతిలపై తక్షణమే చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని కోరారు. అనుమతి లేకుండా ఉత్సవాలు నిర్వహించారంటూ ఆరోపణ ఆదివాసీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ.. గుండాల ఏకలవ్య పాఠశాలలో ప్రభుత్వ అనుమతి లేకుండా తీజ్ ఉత్సవాలు, బంజారా పండుగలు నిర్వహిస్తూ విద్యార్థుల మధ్య విభేదాలకు దారితీసే పరిస్థితులు కల్పించారని ఆరోపించారు. పాఠశాల వంటి విద్యాలయంలో విద్యార్థులందరినీ సమానంగా చూడాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని, కానీ అందుకు విరుద్ధంగా వ్యవహరించడం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ సంఘాలు పాఠశాల ఎదుట నిరాహార దీక్షలు, నిరసన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆందోళనల నేపథ్యంలో ఐటీడీఏ-ఈఎంఆర్ఎస్ అధికారులు సంబంధిత సిబ్బందిని తాత్కాలికంగా బదిలీ చేసినప్పటికీ, అది శాశ్వత పరిష్కారం కాదని సంఘాల నాయకులు స్పష్టం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడొద్దు ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన విద్యాసంస్థల్లో ఇలాంటి ఘటనలు పునరావృతమైతే విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్యా వ్యవస్థపై నమ్మకం దెబ్బతింటుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల మధ్య కుల, వర్గ, ప్రాంతీయ విభేదాలకు తావులేకుండా పాఠశాలల్లో ప్రశాంతమైన విద్యా వాతావరణాన్ని కల్పించాలని కోరారు.

**తల్లిదండ్రులతో పర్యవేక్షణ కమిటీలు ఏర్పాటు చేయాలి**

గిరిజన గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో స్థానిక పీసా కమిటీల ఆధ్వర్యంలో తల్లిదండ్రులతో కూడిన పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని, వివక్షకు తావులేకుండా పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని కోరారు. విద్యార్థుల మధ్య వివక్షకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నలుగురు సిబ్బందిని వెంటనే విధుల నుంచి తొలగించి, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు అదనపు కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో తుడుందెబ్బ జాతీయ ఉపాధ్యక్షులు కోడెం వెంకటేశ్వర్లు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్తిరాజు, ఆదివాసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణ దొర, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షులు సనప కోటేశ్వరరావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కార్యదర్శి సోంది మల్లు దొర, జిల్లా నాయకులు ఈసం ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## గుండాల–రంగాపురం ప్రధాన రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి

### - ఫారెస్ట్ అనుమతుల పేరుతో ఏళ్ల తరబడి జాప్యం..
### - ప్రజల ఇబ్బందులు పట్టించుకోరా?
### - 20 కిలోమీటర్ల మేర నిలిచిపోయిన రహదారి పనులు
### - పదిహేనేళ్లుగా మరమ్మతుల పేరుతో నిధులు.. ల్
### - శాశ్వత పరిష్కారం ఎక్కడ?
### - పనులు పూర్తి చేయకుంటే ఆందోళన ఉధృతం చేస్తాం: సీపీఎం మండల నాయకులు తోలెం గోపి

గుండాల, ఆగస్టు 24, అనంత జనశక్తి న్యూస్



: గుండాల నుంచి రంగాపురం వెళ్లే ప్రధాన రహదారి నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేసి ప్రజల కష్టాలను పరిష్కరించాలని సీపీఎం మండల నాయకులు తోలెం గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అటవీ అనుమతుల పేరుతో రహదారి పనులను అర్ధాంతరంగా నిలిపివేయడం వల్ల గిరిజన ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సీపీఎం నాయకుల బృందం గుండాల-రంగాపురం ప్రధాన రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించింది. సాయినపల్లి పంచాయతీ పరిధిలో రహదారి పరిస్థితిపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా తోలెం గోపి మాట్లాడుతూ.. గుండాల నుంచి రంగాపురం వరకు సుమారు 20 కిలోమీటర్ల మేర రహదారి పనులు నిలిచిపోవడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు.

అటవీ అనుమతులతో పనులు నిలిపివేత

రహదారి పనులు పూర్తి కాకుండా మధ్యలోనే నిలిచిపోవడానికి అటవీ శాఖ అనుమతులు ప్రధాన కారణంగా కాంట్రాక్టర్ చెబుతున్నారని గోపి తెలిపారు. అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం ప్రజల ఉమ్మడి హక్కులను గుర్తించి, అవసరమైన అనుమతులు కల్పించి రహదారి నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని డిమాండ్ చేశారు. ఈ రహదారి గుండాల మండల ప్రజలకు అత్యంత కీలకమైనదని, మేడారం, మణుగూరు తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు కూడా దీనిపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. నిత్యం విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే ప్రధాన మార్గం ఇంత దారుణంగా ఉండటం బాధాకరమన్నారు.15 ఏళ్లుగా ఇదే పరిస్థితి.. శాశ్వత పరిష్కారం ఏదీ?

ప్రతి సంవత్సరం రహదారి మరమ్మతుల పేరుతో సుమారు రూ.5 లక్షల వరకు నిధులు మంజూరు చేయిస్తూ, అక్కడక్కడ గ్రావెల్ పోసి పనులు ముగిస్తున్నారని తోలెం గోపి ఆరోపించారు. గత పదిహేనేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, ప్రజలకు శాశ్వతంగా ఉపయోగపడే బీటీ రహదారి నిర్మించకుండా తాత్కాలిక మరమ్మతులతో కాలం వెళ్లదీస్తున్నారని విమర్శించారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నప్పటికీ సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రహదారి పనులను వెంటనే పునఃప్రారంభించి పూర్తి చేయాలని కోరారు.

బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి

అటవీ ప్రాంతంలో నిలిచిపోయిన రహదారి పనులకు అవసరమైన అనుమతులు వెంటనే సాధించి, పూర్తి స్థాయి బీటీ రహదారి నిర్మాణాన్ని చేపట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ప్రజల సమస్యను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు జోగా రాజేష్, ఉకే వెంకటేశ్వర్లు, వాగబోయిన నర్సింగరావు, వాగబోయిన పోతయ్య, కల్తీ సమ్మయ్య, ఏరం రామకృష్ణ, జోగా రవి, దుగ్గి రామ్మూర్తి, కల్తీ రామస్వామి, గడ్డం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ లో అభివృద్ధి పనులకు శ్రీకారం

### - పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన
### - ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 24,(అనంత జన శక్తి )

మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు.బడంగ్‌పేట్ లోని ఏజీఆర్ కాలనీలో రూ.36 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, నాదర్‌గుల్ శాంతి నగర్ కాలనీలో రూ.16 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు, గుర్రంగూడ జీబీఆర్ కాలనీలో రూ.13 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ మొత్తం రూ.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులతో ఆయా కాలనీలలో ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. కాలనీలలో మౌలిక వసతులను బలోపేతం చేయడంతో పాటు ప్రజల రోజువారీ అవసరాలకు అనుగుణంగా సౌకర్యాలు కల్పించేందుకు ఈ పనులను చేపడుతున్నామన్నారు.మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రతి కాలనీలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామని తెలిపారు.

**ప్రజల అవసరాలకు అనుగుణంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.**





# వర్షా కాలంలో పీరియడ్స్ సమయంలో పరిశుభ్రత లేకపోతే మహిళలకు 3 రకాల ఆరోగ్య సమస్యలు

వర్షా కాలంలో, ముఖ్యంగా ఉద్యోగాలు చేసే మహిళలకు రుతుక్రమ పరిశుభ్రత పాటించడం పెద్ద సవాలుగా మారుతుంది. సుదీర్ఘ ప్రయాణాలు, తడి దుస్తులు, సరిపడా వాష్‌రూమ్ సౌకర్యాలు లేకపోవడం వంటివి ఇన్ఫెక్షన్ల ప్రమాదాన్ని పెంచుతాయి. భారీ వర్షా లు, తడిసిన బట్టలు, అధిక తేమతో కూడిన వాతావరణం మహిళలకు రుతుక్రమ సమస్యలను మరింత తీవ్రం చేస్తుంది. దీనికి తోడు, ఉద్యోగాలు చేసే మహిళలు పనుల నిమిత్తం ఎక్కువ దూరం ప్రయాణం చేయాల్సి రావడం సమస్యలను మరింత జఠిలం చేస్తుంది.



ఇంటర్నేషనల్ SOS మెడికల్ డైరెక్టర్ డాక్టర్ విక్రమ్ వోరా మాట్లాడుతూ, వర్షా కాలంలో మహిళలు ఎదుర్కొనే రుతుక్రమ పరిశుభ్రత సవాళ్ల గురించి వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించాలంటే, కార్యాలయాల్లో మంచి విధానాలు, తగిన వాతావరణం ఉండాలని ఆయన పేర్కొన్నారు.

డాక్టర్ వోరా మాట్లాడుతూ, వర్షా కాలంలో వాతావరణ పరిస్థితులు రుతుక్రమ పరిశుభ్రతకు సవాళ్లు విసురుతాయని అన్నారు. "వర్షా కాలం మహిళల రుతుక్రమ సమయంలో అనేక సమస్యలను తెస్తుంది. నిరంతరం తేమ, చెమట, తడిసిన దుస్తుల కారణంగా పరిశుభ్రతను పాటించడం చాలా కష్టమవుతుంది. శానిటరీ ఉత్పత్తులను తరచుగా మార్చడం, గాలి తగిలే కాటన్ లోదుస్తులు ధరించడం, జననేంద్రియ ప్రాంతాన్ని పొడిగా ఉంచుకోవడం చాలా ముఖ్యం" అని ఆయన వివరించారు.

ఉద్యోగం చేసే మహిళలకు ఈ సమస్య



ఊహించలేని వాతావరణంలో సుదీర్ఘ ప్రయాణాలు, సరిపడా కార్యాలయ మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల మరింత పెరుగుతుంది. శుభ్రమైన టాయిలెట్లు అందుబాటులో లేకపోవడం వల్ల లేదా కార్యాలయ పరిశుభ్రత సరిగా లేకపోవడం వల్ల మహిళలు తమ రుతుక్రమ ఉత్పత్తులను మార్చడంలో ఆలస్యం చేయాల్సి వస్తుంది. దీనివల్ల దద్దుర్లు, దురద, మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. వర్షా కాలంలో రుతుక్రమ పరిశుభ్రతను కాపాడటం మహిళల ఆరోగ్యం, ఆత్మగౌరవం, కార్యాలయంలో వారి ఉత్పాదకతకు చాలా అవసరం" అని డాక్టర్ వోరా వివరించారు.

వర్షా కాలంలో రుతుక్రమానికి సంబంధించిన ఆరోగ్య సవాళ్లు:

బాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు: తడి లోదుస్తులు లేదా ప్యాడ్‌లను ఎక్కువసేపు ధరించడం వల్ల, ముఖ్యంగా సుదీర్ఘ ప్రయాణాల సమయంలో, బాక్టీరియల్ వాగినోసిస్,



యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు , కాండిడియాసిస్ (ఫంగల్ ఇన్ఫెక్షన్) వంటివి వస్తాయి. వాతావరణంలో అధిక తేమ ఉండటం వల్ల జననేంద్రియ ప్రాంతంలో ఎక్కువసేపు తడిగా ఉండి, సాధారణంగా బాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు ఎక్కువగా వస్తాయి.

చర్మంపై చికాకు: తడి దుస్తులు, సింథటిక్ శానిటరీ ప్యాడ్‌ల వల్ల చర్మం రాపిడికి గురై, తొడల లోపలి భాగంలో, గజ్జలలో చర్మంపై చికాకు, దద్దుర్లు వస్తాయి.

సున్నితమైన చర్మ సమస్యలు తీవ్రతరం: సున్నితమైన చర్మం ఉన్న మహిళలు లేదా ఎగ్జిమా వంటి ముందే ఉన్న సమస్యలు ఉన్నవారికి ఈ సీజన్‌లో వారి లక్షణాలు మరింత పెరగవచ్చు.

శుభ్రమైన వాష్‌రూమ్‌లు: పరిశుభ్రమైన, మంచి గాలి వెలుతురు ఉండే, పొడి వాష్‌రూమ్‌లు అందుబాటులో ఉండాలి.

తరచుగా శుభ్రపరచడం: తేమ, దుర్వాసన, ఇన్ఫెక్షన్లు వ్యాప్తి చెందకుండా వాష్‌రూమ్‌లను తరచుగా శుభ్రం చేయాలి.

శానిటరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంచడం: అన్ని మహిళల వాష్‌రూమ్‌లలో అదనపు శానిటరీ ప్యాడ్‌లు లేదా ట్యాంపూన్‌లు ఉండేలా చూసుకోవాలి.

శానిటరీ డిస్పోజల్ యూనిట్లు: వాడిన ప్యాడ్‌లు పడేసే డబ్బాలను (శానిటరీ డిస్పోజల్ యూనిట్లు) క్రమం తప్పకుండా ఖాళీ చేసి, వాటిని శుభ్రంగా ఉంచాలి.

అదనపు సౌకర్యాలు: ఎగ్జాస్ట్ ఫ్యాన్‌లు, జారిపడకుండా ఉండే మ్యాట్‌లను ఏర్పాటు చేయడం, తగినంత లైటింగ్ ఉండేలా చూసుకోవడం వంటి అదనపు చర్యలు భద్రత, సౌకర్యాన్ని పెంచుతాయి.

రుతుక్రమ సెలవు లేదా వర్క్-ఫ్రమ్-హోమ్: వర్షా కాలంలో రుతుక్రమ సెలవు లేదా ఇంటి నుండి పనిచేసే సౌకర్యాన్ని కల్పించడం ఉద్యోగుల శ్రేయస్సుకు చాలా సహాయపడుతుంది.

# ఆరోగ్య రహస్యం వంటింట్లోనే ఉంది: 5 అద్భుతమైన భారతీయ సూపర్ ఫుడ్స్ ఇవే





ఇంటర్నెట్‌లో రోజూ పుట్టుకొస్తున్న కొత్త ట్రెండ్స్, వెల్‌నెస్ చిట్కాల వెనుక పరుగెత్తే ముందు, మన భారతీయ వంటశాలల్లో ఎప్పుడూ ఉండే సాంప్రదాయ సూపర్ ఫుడ్స్ గురించి తెలుసుకోవడం చాలా ముఖ్యం. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అట్మంటన్ వెల్‌నెస్ సెంటర్ వ్యవస్థాపక డైరెక్టర్, స్పోర్ట్స్ న్యూట్రిషనిస్ట్ నిఖిల్ కపూర్ ఇంటర్వ్యూలో ఈ విషయాలు పంచుకున్నారు. "సీ మాస్, అకై బెర్రీ వంటి విదేశీ పదార్థాలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందే చాలా కాలం ముందే, భారతీయ కుటుంబాలు తరతరాలుగా వస్తున్న జ్ఞానంతో, మన వంటింట్లో దొరికే సాధారణ సూపర్ ఫుడ్స్‌పై ఆధారపడ్డాయి" అని నిఖిల్ కపూర్ వివరించారు.

1. పసుపు

మన భారతీయ ఇళ్లలో ప్రతి వంటకంలో చిటికెడు పసుపు వేయడం ఆనవాయితీ. ఆధునిక ఆరోగ్య విజ్ఞానంలో కూడా పసుపు తన స్థానాన్ని నిలుపుకోవడం ఆసక్తికరం. పసుపులో ఉండే ముఖ్యమైన సమ్మేళనం కర్కుమిన్ కేవలం వాపులను తగ్గించడమే కాదు. ఇది మానసిక స్థితిని ప్రభావితం చేసే న్యూరోట్రాన్స్‌మిటర్లైన సెరోటోనిన్, డోపమైన్‌లను నియంత్రించడంలో సహాయపడుతుంది. అలాగే, మెదడు పనితీరును, ప్రేగులలోని సూక్ష్మజీవుల సమతుల్యతను కూడా మెరుగుపరుస్తుంది. భారతీయ వంటకాల్లో పసుపును వాడే పద్ధతి అనుకోకుండా ఏర్పడింది కాదు.. దాని శోషణను, ఔషధ గుణాలను పెంచడానికి ఇది ఒక పురాతన పద్ధతి.

2. నెయ్యి

ఆరోగ్యకరమైన కొవ్వుల గురించి మాట్లాడినప్పుడు నెయ్యిని తరచుగా పట్టించుకోరు. కానీ, ఇది మన ఆహారంలో చేర్చుకోగల అత్యంత పోషకమైన ఆహారాలలో ఒకటి. నెయ్యి ప్రేగుల ఆరోగ్యానికి, కొవ్వులో కరిగే



పోషకాలను శరీరం గ్రహించడానికి సహాయపడుతుంది. స్థిరమైన శక్తిని అందిస్తుంది. నెయ్యి కండరాల రికవరీలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే బ్యూట్రిక్ యాసిడ్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాల వల్ల, శారీరక శ్రమ తర్వాత లేదా నయం అయ్యే దశల్లో కణజాల మరమ్మత్తుకు నెయ్యి మద్దతు ఇస్తుంది.

3. మునగ

మనకు అందుబాటులో ఉన్న అద్భుతమైన మొక్కలలో మునగ ఒకటి. మునగ రక్తంలో చక్కెర నియంత్రణ, కాలేయ ఆరోగ్యం, మానసిక స్పష్టతతో సహా వివిధ ఆరోగ్య అంశాలకు మద్దతు ఇస్తుంది. ఇది ఒక 'తెలివైన ఆకుపచ్చని ఆహారం' అని చెప్పొచ్చు. శరీరంలో, మెదడులో వాపును తగ్గించే అడాప్టోజెనిక్ ప్రయోజనాలను అందిస్తుంది. మనం ఎప్పుడూ మునగాకులను పప్పులు, సూప్‌లలో ఉపయోగిస్తాం. ఈ సాధారణ పద్ధతి



రోజువారీ రోగనిరోధక శక్తికి ఎంత ప్రభావవంతంగా ఉంటుందో సైన్స్ ఇప్పుడు ధృవీకరిస్తుంది.

4. ఉసిరి

శతాబ్దాలుగా రోగనిరోధక శక్తిని పెంచడానికి ఉసిరిని ఉపయోగిస్తున్నారు. అయితే, దీని ప్రయోజనాలు చాలా లోతైనవి. ఇది జీర్ణక్రియను నియంత్రించడంలో, ప్రేగులలోని మైక్రోబయోటాను (సూక్ష్మజీవులను) ఆరోగ్యంగా ఉంచడంలో, మెదడులోని ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇవన్నీ గట్-బ్రెయిన్ యాక్సిస్ (ప్రేగు-మెదడు అనుసంధానం)కు కీలకమైన అంశాలు. పచ్చిగా, రసంగా లేదా చ్యవనప్రాష్ వంటి సాంప్రదాయ రూపాలలో నిరంతరం ఉసిరిని వాడటం వల్ల కాలక్రమేణా శక్తి, ఏకాగ్రత, రోగనిరోధక శక్తిలో ఒక రకమైన అంతర్గత బలం పెరుగుతుంది.

5. అరటిపండు

సాధారణంగా దొరికే ఆహారాలు ఎంత శక్తివంతమైనవో మనం మర్చిపోతుంటాం. అరటిపండు ఎల్లప్పుడూ శక్తికి నమ్మకమైన మూలం. అంతేకాకుండా, ఇది ప్రిబయోటిక్ ఫైబర్‌తో ప్రేగులకు పోషణను అందిస్తుంది. B6, పొటాషియం వంటి వాటితో నాడీ వ్యవస్థ పనితీరుకు మద్దతు ఇస్తుంది. ఇది మన శరీర అవసరాలకు అనుగుణంగా, సులభంగా అందుబాటులో ఉండే ఒక అద్భుతమైన ఆహారం. తక్కువ పండిన, పచ్చి అరటిపండులో రెసిస్టెంట్ స్టార్చ్ చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ప్రయోజనకరమైన ప్రేగు బ్యాక్టీరియాకు ఆహారాన్ని అందించే శక్తివంతమైన ప్రిబయోటిక్. ఇది జీవక్రియ ఆరోగ్యాన్ని కూడా ప్రోత్సహిస్తుంది.

అరటిపండు తక్షణ శక్తిని అందిస్తుంది. రెండు రకాల అరటిపండ్లకు వాటి ప్రత్యేక ప్రయోజనాలు ఉన్నాయి. పచ్చి అరటిపండ్లు ప్రేగు ఆరోగ్యానికి, రక్తంలో చక్కెర సమతుల్యతకు పనికొస్తే, పండిన అరటిపండ్లు సులభంగా జీర్ణమయ్యే శక్తికి ఉపయోగపడుతాయి.

అనంత జనశక్తి

మంగళవారం | రంగారెడ్డి
25.08.2026



# ఆత్మకథగా రజనీకాంత్ జీవిత ప్రయాణం.. అధికారికంగా ప్రకటించిన కుమార్తె



అగ్ర కథానాయకుడు రజనీకాంత్ తన జీవిత ప్రయాణాన్ని ఆత్మకథ రూపంలో అభిమానులతో పంచుకోనున్నారు. తాజాగా ఈ విషయాన్ని ఆయన కుమార్తె, దర్శకురాలు సౌందర్య వెల్లడించారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె.. తాను కూడా ఆ పుస్తకం రాసే పనిలో పాల్గొన్నట్లు తెలిపారు. "నాన్నగారు తన ఆత్మకథ రాస్తున్నారు. ఆ పుస్తకాన్ని ఎలా రూపుదిద్దుతున్నారో నేను దగ్గర ఉండి చూశా. ఇది చాలా ఏళ్ల పాటు పాఠకులు మళ్లీ మళ్లీ చదివే పుస్తకంగా నిలుస్తుందని నమ్ముతున్నా. యోగి పరమహంస యోగానంద గారు రాసిన 'ఒక యోగి ఆత్మకథ' పుస్తకం తరతరాలకు ఎంత స్ఫూర్తినిస్తుందో మా నాన్నగారి కథ కూడా అలాగే ఉంటుంది. భారతీయ చిత్ర పరిశ్రమలో అతిపెద్ద నటులలో ఒకరిగా ఎదిగిన ఆయన ప్రయాణం సామాన్యమైంది కాదు. ఐదు దశాబ్దాలుగా ఆయన వ్యక్తిగత అనుభవాలు, వృత్తిపరమైన విజయాలు, అగ్రస్థానానికి చేరుకునేందుకు ఎదుర్కొన్న సవాళ్లు తదితర వివరాలన్నీ ఇందులో ఉండనున్నాయి" అని ఆమె పేర్కొన్నారు.

తన తండ్రి జీవితాన్ని తెరపైకి తీసుకువస్తే ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఆమె సమాధానమిచ్చారు. "ఒకవేళ నాన్నగారి జీవితాన్ని సినిమాగా తీస్తే, అది నాకు వ్యక్తిగతంగా, వృత్తిపరంగా అత్యంత ప్రత్యేకమైందిగా ఉంటుంది. ఒక చిత్ర దర్శకుడు తనలోని ప్రతి ఆలోచనను ఒకే కథలో పెట్టలేడు. ఏ కథకు ఏది అవసరమో తెలుసుకోవాలి. మిగిలిన ఆలోచనలను భవిష్యత్తు కథల కోసం దాచుకోవాలి. సృజనకు స్పష్టత, క్రమశిక్షణ అవసరమని నాన్నగారు నాకు నేర్పారు. రజనీకాంత్ కుమార్తెగా పుట్టడం గొప్ప వరం. ఆయన కూతురునైనందుకు పోలికలు, అంచనాలు కూడా ఉంటాయి. నేను ఇష్టంతోనే చిత్రరంగంలోకి వచ్చాను. దాని గురించి నాకు ఎలాంటి పశ్చాత్తాపం లేదు" అని చెప్పారు.

ప్రస్తుతం ఆమె నిర్మాణంలో నెట్‌ఫ్లిక్స్ కోసం '#లవ్' అనే తమిళ వెబ్‌సిరీస్ రూపొందుతోంది. ఈ రొమాంటిక్ సిరీస్‌కు బాలాజీ మోహన్ దర్శకత్వం వహిస్తున్నారు. అర్జున్ దాస్, ఐశ్వర్య లక్ష్మి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. అక్టోబరులో నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదల కానుంది.

# వివాహబంధంలోకి టాలీవుడ్ హీరో..



టాలీవుడ్ హీరో ప్రిన్స్ ఓ ఇంటివాడయ్యారు. తన ప్రియురాలు సాయి మాచిరాజు ) మెడలో మూడుముళ్లు వేశారు. పెద్దల అంగీకారంతో ఆగస్టు 24న న్యూజిలాండ్ వేదికగా వీరి వివాహం జరిగింది. ఈ ఫొటోలను ఇన్‌స్టాలో పంచుకున్న ప్రిన్స్.. జీవితకాలపు బంధానికి స్వాగతమంటూ లవ్ ఎమోజీలను జోడించారు.

ఒక కామన్ ఫ్రెండ్ పెళ్లిలో న్యూజిలాండ్‌కు చెందిన ఎన్నారై సాయి మాచిరాజుతో ప్రిన్స్‌కు పరిచయం ఏర్పడింది. కొద్దిరోజుల్లోనే వీరిమధ్య ప్రేమ చిగురించింది. ఈ ఏడాది జూన్‌లో అత్యంత సన్నిహితులు, కుటుంబ సభ్యుల సమక్షంలో వీరి నిశ్చితార్థం జరిగింది. ఇప్పుడు వివాహబంధంతో ఒక్కటయ్యారు. తేజ దర్శకత్వంలో వచ్చిన 'నీకు నాకు డాష్ డాష్' సినిమాతో ఇండస్ట్రీకి పరిచయమయ్యారు ప్రిన్స్. మారుతి దర్శకత్వం వహించిన 'బస్ స్టాప్'తో గుర్తింపు తెచ్చుకున్నారు. హీరోగానే కాకుండా సహాయ నటుడిగా ప్రాధాన్యత ఉన్న పాత్రల్లోనూ నటిస్తున్నారు.

# సంక్రాంతికి 'కాకా' వస్తుండు..




"మన టార్గెట్ పండగ రా. అప్పటి దాకా ఎవరికీ సెలవుల్లేవు" అంటున్నారు కథానాయకుడు చిరంజీవి. ఇప్పుడాయన బాబీ దర్శకత్వంలో తన 158వ సినిమాని చేస్తున్న సంగతి తెలిసిందే. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. అనస్వర రాజన్, నివేదా పేతురాజ్, సునీల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి 'కాకా' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ మేరకు శనివారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ని బయటకు వదిలారు. ఇక ఈ ప్రచార చిత్రం విషయానికొస్తే.. దీంట్లో చిరు పాత్రలోని భిన్న కోణాల్ని పరిచయం చేసే ప్రయత్నం చేశారు. ఇందులో ఆయన ఆక్వా సంస్థలో పని చేసే ఉద్యోగిగా కె.సత్యం అనే పాత్రలో కనిపించనున్నారు.

"ఇది సత్యం మాట.. ఇంకా డౌటా" అనే డైలాగ్‌తో తన పాత్ర స్వభావాన్ని తెలియజేశారు. ఇక నీళ్లలో పడిన బైక్ తాళాన్ని ఆయన బయటకు తీసిన తీరు.. దానికి ఉన్న 'ఐ లవ్ డాడీ' అనే కీ చైన్.. దానితో పాటు బయటకొచ్చిన మిషన్ గన్స్.. ఈ కథలోని ముఖ్య పార్శ్వాల్ని తెలియజెప్పాయి. ఓవైపు ఫాదర్ ఎమోషన్.. మరోవైపు స్టైలిష్ యాక్షన్ ఈ సినిమాకి ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నట్లు గ్లింప్స్‌లో కనిపించిన సన్నివేశాల్ని బట్టి అర్థమవుతోంది. ఇందులో చిరు తన వయసుకు తగ్గట్లుగా కొత్త లుక్స్‌లో కనిపించిన తీరు.. వీడియోలో వినిపించిన 'గ్యాంగ్ లీడర్'లోని "పాప రీటా.." బ్యాగ్రౌండ్ మ్యూజిక్ హైలైట్‌గా నిలిచాయి. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సంక్రాంతి సందర్భంగా వచ్చే ఏడాది జనవరి 13న విడుదల కానుంది. ఈ సినిమాకి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: విజయ్ కార్తీక్ కన్నన్.

చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా 'విశ్వంభర' నుంచి ఓ కొత్త పోస్టర్‌తో పాటు ఒరిజినల్ సౌండ్ ట్రాక్ విడుదలైంది. ఆ ప్రచార చిత్రంలో త్రిశూలం పట్టుకుని సీరియస్ లుక్‌లో చిరు కనిపించిన తీరు.. సౌండ్ ట్రాక్‌లో గౌర హరి సంగీతం అలరించాయి. వశిష్ఠ దర్శకత్వంలో ముస్తాబైన ఈ సోషియో ఫాంటసీ అడ్వెంచర్ థ్రిల్లర్ ప్రస్తుతం ముగింపు దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీపై స్పష్టత ఇవ్వనున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ సినిమాకి ఎంఎం కీరవాణి, భీమ్స్ సంగీతమందిస్తున్నారు.

# రెండో రోజూ భారత్‌దే.. ముగిసిన ఆట.. శ్రీలంక 8/2



శ్రీలంక, భారత్ మధ్య జరుగుతున్న రెండో టెస్టులో రెండో రోజు ఆట ముగిసింది. ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో శ్రీలంక 8/2తో ఉంది. ప్రభాత్ జయసూర్య (2) రెండో వికెట్‌గా ఔటైన తర్వాత ఆట ముగిసినట్లు ప్రకటించారు. ప్రస్తుతం కమిల్ మిశ్రా (5*) క్రీజులో ఉన్నాడు. లంక ఇంకా 495 పరుగుల వెనుకంజలో ఉంది. అంతకుముందు 300/5తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్ ఒక్కో వికెట్ పడగొట్టారు.

తొలి ఇన్నింగ్స్ ఆరంభంలోనే శ్రీలంకకు షాక్ తగిలింది. ప్రసిద్ధ్ కృష్ణ బౌలింగ్‌లో లహిరు ఉదార (1) పెవిలియన్ చేరాడు. ఔట్‌సైడ్ ఎడ్జ్ అయిన బంతి నేరుగా థర్డ్ స్లిప్‌లో ఉన్న జైస్వాల్ చేతిలో పడింది. 2 ఓవర్లకు శ్రీలంక స్కోరు 2/1.

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియా భారీ స్కోరు చేసింది. 300/5తో రెండో రోజు ఆటను కొనసాగించిన భారత్ 503/9 వద్ద డిక్లేర్ చేసింది. ఏడు పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో బ్యాటింగ్‌కు వచ్చిన ధ్రువ్ జురెల్ (115*; 177 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఆదివారం మూడు పరుగులు చేసి రిటైర్డ్ హర్ట్ అయిన రిషభ్ పంత్ (63; 89 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) తిరిగి బ్యాటింగ్‌కు వచ్చి అర్ధ శతకం బాదాడు. మానవ్ సుతార్ (18) పరుగులు చేసి వెనుదిరిగాడు. శ్రీలంక బౌలర్లలో అసిత ఫెర్నాండో 4, ప్రభాత్ జయసూర్య 2, కేశర నువాంతు 2, లాహిరు కుమార ఒక వికెట్ పడగొట్టారు. తర్వాత శ్రీలంక బ్యాటింగ్‌కు దిగగా.. రెండు బంతులు పడగానే ఆకాశం మేఘావృతం కావడంతో ముందు జాగ్రత్తగా ఆటను నిలిపి వేసి మైదానాన్ని కవర్లతో కప్పి ఉంచారు.

ఆట తిరిగి ప్రారంభం కాగా.. భారత బ్యాటర్ ధ్రువ్ జురెల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 171 బంతుల్లో అతను మూడంకెల స్కోరు అందుకున్నాడు. జురెల్ 99 పరుగులకు చేరిన తర్వాత సెంచరీ అందుకోవడానికి 13 బంతులు తీసుకున్నాడు. అయితే, శతకం పూర్తి చేసుకున్న తర్వాత ఎదుర్కొన్న తొలి బంతినే జురెల్ సిక్సర్‌గా మలిచాడు. అనంతరం ప్రభాత్ జయసూర్య బౌలింగ్‌లో సిరాజ్ (3) ఎల్బీడబ్ల్యూగా వెనుదిరగడంతో భారత్ తొమ్మిదో వికెట్ కోల్పోయింది. 137 ఓవర్లకు భారత్ స్కోరు 489/9. జురెల్ (106) తోపాటు ప్రసిద్ధ్ కృష్ణ క్రీజులో ఉన్నారు.

వర్షం తగ్గిపోవడంతో మ్యాచ్‌ను కొనసాగించేందుకు మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు. 4:25 గంటలకు ఆట తిరిగి ప్రారంభంకానుంది. సరైన వెలుతురు ఉండి వాతావరణం అనుకూలిస్తే సాయంత్రం 6 గంటల వరకు ఆట నిర్వహించనున్నారు.

కొలంబోలో వర్షం కురవడం ఆగిపోయింది. ప్రస్తుతం ఎండ కూడా కాస్తోంది. దీంతో మ్యాచ్ నిర్వహణకు వీలుగా సిబ్బంది మైదానాన్ని సిద్ధం చేస్తున్నారు.

రెండో టెస్టుకూ వరుణుడు అంతరాయం కలిగింది. దీంతో ఆటను అంపైర్లు నిలిపివేశారు. మైదానాన్ని సిబ్బంది కవర్లతో కప్పేశారు. ప్రస్తుతం భారత్ స్కోరు 131.2 ఓవర్లకు 475/8. ధ్రువ్ జురెల్ (95*) సెంచరీకి చేరువగా వచ్చాడు. అతడితోపాటు క్రీజ్‌లో మహ్మద్ సిరాజ్ ఉన్నాడు. వర్షం రావడంతో టీ బ్రేక్‌ను ముందే ప్రకటించారు.

భారత్ ఎనిమిదో వికెట్‌ను నష్టపోయింది. ఇక ప్రభాత్ జయసూర్యకు ఎట్టకేలకు వికెట్ దక్కింది. జయసూర్య వేసిన (124.4వ ఓవర్) బంతిని ఆడే క్రమంలో మానవ్ సుతార్ (18) వికెట్ కీపర్ డిక్వెల్లాకు క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు చేరాడు. ప్రభాత్‌కు ఇది 36వ ఓవర్ కావడం గమనార్హం. ప్రస్తుతం భారత్ స్కోరు 458/8.

భారత్ ఇన్నింగ్స్ సాఫీగా సాగుతోంది. రిషభ్ పంత్ ఔటైన తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన మానవ్ సుతార్ (13*) కూడా క్రీజ్‌లో పాతుకుపోయాడు. మరోవైపు ధ్రువ్ జురెల్ (76*) కీలక ఇన్నింగ్స్ ఆడుతున్నాడు. అనవసమైన షాట్లకు పోకుండా పరుగులు రాబట్టడంపైనే భారత బ్యాటర్లు దృష్టి పెట్టారు. ప్రస్తుతం భారత్ స్కోరు 122 ఓవర్లకు 450/7.

రిషభ్ పంత్ (63) ఔటయ్యాడు. లంచ్ బ్రేక్ తర్వాత ఆడిన తొలి బంతికే పెవిలియన్‌కు చేరడం గమనార్హం. కేశర నువాంత వేసిన (112.1వ ఓవర్) తొలి బంతిని పంత్ భారీ షాట్ కొట్టాడు. కానీ, డీప్ మిడాఫ్‌లో లాహిరు ఉదారా చేతికి చిక్కాడు. దీంతో ధ్రువ్ జురెల్‌తో ఏడో వికెట్‌కు 112 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. అనంతరం బ్యాటింగ్‌కు మానవ్ సుతార్ వచ్చాడు. ప్రస్తుతం భారత్ స్కోరు 113 ఓవర్లకు 419/7. క్రీజ్‌లో సుతార్, ధ్రువ్ జురెల్ (59*) ఉన్నారు.

శ్రీలంకతో రెండో టెస్టు రెండో రోజు ఆటలో తొలి సెషన్ ముగిసింది. లంచ్ బ్రేక్ సమయానికి భారత్ స్కోరు 419/6. క్రీజ్‌లో రిషభ్ పంత్ (63*), ధ్రువ్ జురెల్ (59*) ఉన్నారు. వీరిద్దరూ ఏడో వికెట్‌కు ఇప్పటి వరకు 112 పరుగులు జోడించారు. ఇక ఈ సెషన్‌లో భారత్ 119 పరుగులను రాబట్టింది.

భారత బ్యాటర్లు రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్ అర్ధశతకాలు సాధించారు. తొలుత 81 బంతుల్లో పంత్ హాఫ్ సెంచరీని పూర్తి చేశాడు. కెరీర్‌లో ఇది అతడికి 21వది. తర్వాత ధ్రువ్ జురెల్ 99 బంతుల్లో తన మూడో హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకొన్నాడు. వీరిద్దరి భాగస్వామ్యం కూడా సెంచరీకి చేరువగా ఉంది. ప్రస్తుతం భారత్ స్కోరు 110 ఓవర్లకు 403/6. క్రీజ్‌లో పంత్ (51*), ధ్రువ్ జురెల్ (55*) ఉన్నారు.

భారత ఆటగాడు రిషభ్ పంత్ అద్భుతమైన ఘనత సాధించాడు. ఈ క్రమంలో మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనిని అధిగమించాడు. విదేశీ గడ్డపై టెస్టుల్లో అత్యధిక పరుగులు చేసిన భారత వికెట్ కీపర్‌గా పంత్ రికార్డు నమోదు చేశాడు. ధోని 2,496 పరుగులు చేయగా.. పంత్ 2500 పరుగుల మైలురాయిని దాటేశాడు. శ్రీలంకతో రెండో టెస్టులో పంత్ దూకుడుగా ఆడేందుకు ప్రయత్నిస్తున్నాడు. ప్రస్తుతం భారత్ స్కోరు 103 ఓవర్లకు 376/6. క్రీజ్‌లో పంత్ (39*), ధ్రువ్ జురెల్ (40*) ఉన్నారు.

గాయం కావడంతో నిన్న రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగిన రిషభ్ పంత్ (18*) ఇవాళ బరిలోకి దిగాడు. అయితే, 94వ ఓవర్‌లో అసిత వేసిన బంతిని ఆడే క్రమంలో.. పంత్ భుజం కింది భాగంలో బలంగా తాకింది. అయితే, ఆ బంతి స్టంప్స్‌కు కాస్త పక్కగా వెళ్లింది. ఒకవేళ స్టంప్స్‌ను తాకి ఉండుంటే కచ్చితంగా పంత్ పెవిలియన్‌కు చేరేవాడు. అయితే, అదృష్టం మాత్రం పంత్ వైపు నిలిచింది. షార్ట్ పిచ్ బంతులతో ఇబ్బంది పెట్టేందుకు ఇవాళ కూడా లంక పేసర్లు ప్రయత్నిస్తున్నారు. కానీ, పంత్ కొట్టిన ఓ బంతి 95 మీటర్ల సిక్స్‌గా వెళ్లింది. ప్రస్తుతం భారత్ స్కోరు 94 ఓవర్లకు 335/6. క్రీజ్‌లో పంత్‌తోపాటు ధ్రువ్ జురెల్ (24*) ఉన్నాడు.

కొలంబో వేదికగా శ్రీలంకతో భారత్ రెండో టెస్టు మ్యాచ్ ఆడుతోంది. రెండో రోజు ఆట కొనసాగుతోంది. అయితే, ఆట ప్రారంభమైన కాసేపటికే టీమ్‌ఇండియా వికెట్ కోల్పోయింది. ఇవాళ రెండో ఓవర్‌లో అసిత ఫెర్నాండో (86.5వ ఓవర్) వేసిన షార్ట్ పిచ్ బంతిని ఆడే క్రమంలో సారాంశ్ జైన్ (6) ఔటయ్యాడు. అతడు ఇచ్చిన క్యాచ్‌ను కమిల్ మిషారా అద్భుతంగా ఒడిసిపట్టాడు. అనంతరం రిషభ్ పంత్ బ్యాటింగ్‌కు వచ్చాడు. నిన్న గాయంతో ఇబ్బంది పడిన పంత్ ఎట్టకేలకు క్రీజ్‌లోకి రావడంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం టీమ్‌ఇండియా స్కోరు 88 ఓవర్లకు 309/6. క్రీజ్‌లో రిషభ్ పంత్ (4*), ధ్రువ్ జురెల్ (12*) ఉన్నారు.

## అసిత ఫెర్నాండోతో గొడవ.. యశస్వి జైస్వాల్‌కు జరిమానా

శ్రీలంకతో జరుగుతున్న రెండో టెస్టులో తొలి రోజు భారత ఆటగాడు యశస్వి జైస్వాల్ - అసిత ఫెర్నాండో మధ్య వాగ్వాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనపై స్పందించిన ఐసీసీ క్రమశిక్షణ చర్యలు చేపట్టింది. ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని లెవెల్ -1ను ఉల్లంఘించినట్లు తేలడంతో యశస్వితోపాటు ఫెర్నాండోకు మ్యాచ్ ఫీజులో 25 శాతం జరిమానా విధించింది. అంతేకాకుండా ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ ఇచ్చింది. తొలి రోజు ఆటలో యశస్వి జైస్వాల్ ఔట్ చేసిన తర్వాత ఫెర్నాండో అత్యుత్సాహం ప్రదర్శించాడు. దీంతో జైస్వాల్ అతడితో వాగ్వాదానికి దిగాడు. ఈ క్రమంలో జైస్వాల్ హెల్మెట్ ఫెర్నాండో నుదుటికి తాకింది. పరిస్థితి చేయిదాటిపోయేలా ఉండటంతో లంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా, వైస్ కెప్టెన్ కమిందు మెండిస్‌తో పాటు ఇతర ఆటగాళ్లు, అంపైర్లు జోక్యం చేసుకుని ఇద్దరినీ దూరం తీసుకెళ్లడం తో ఈ గొడవ సద్దుమణిగింది.



PRINTER, PUBLISHER AND OWNED BY SHANKARAGALLU VENKATESULU, AND PRINTED AT FLAT NO 402,4 FLOOR RADHAMADHAV NILAYAM,BESIDE SURYAVAMSHIGARDEN2,SURYAVAMSHI COLONY, PEDDA AMBERPET., RANGAREDDY, TELANGANA 501505. EDITOR : SHANKARAGALLU VENKATESULU. Printing Press M/S. TRIPURA PUBLICATIONS HOUSE NO.: 58518, REVENUE WARD NO: 05, ASHOK NAGAR COLONY, KAMAREDDY (TOWN & POST), MANDAL, TELANGANA 503111. Email: anantha janasakshi2019@gmail.com, Cell : 9533633213, RNI REGD NO : TGTEL/26/A4945